

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా





సంపుటి - 07 | సంచిక 302 | ఎడిటర్ : బరిగెల శివ | ఆదివారం 04, అక్టోబర్ 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్


# పట్టభద్రులకు.. భద్రత ఎక్కడ!






డాక్టర్ బరిగెల శివ

జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్




పట్టు కోల్పోతున్న పట్టభద్రులు

ఎన్నికలప్పుడే హడావుడి

రాష్ట్రాన్ని వెంటాడుతున్న నిరుద్యోగ సమస్య

పట్టభద్రులైన విద్యార్థులకు అనేక రకాల అవమానాలు జరుగుతున్నాయి

నాయకులకు వ్యక్తిగత స్వార్థమే తప్ప సేవా భారం లేదు

రాజకీయ పార్టీలకు పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థులు దూరంగా ఉండాలి

స్వతంత్ర్యంగా పోరాడితేనే తప్ప పట్టభద్రులకు మేలు జరగదు

సంవత్సరాలు గడుస్తున్న సారెడు అభివృద్ధి లేదు

రాష్ట్రంలో జోరుగా అభివృద్ధి చెందుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు

పట్టభద్రులే డబ్బులు తీసుకొని ఓట్లేస్తే విలువలు ఎక్కడ ఉంటాయి

డాక్టర్ బరిగెల శివ

పట్టభద్రుల భవిష్యత్తుకు భద్రత ఎక్కడని డాక్టర్ బరిగెల శివ ప్రశ్నించారు. ఏళ్లుగా నిరుద్యోగ సమస్య వెంటాడుతున్నా ప్రభుత్వాలు, ప్రజాప్రతినిధులు ఆశించిన స్థాయిలో స్పందించడం లేదన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలోనే రాజకీయ పార్టీల హడావుడి కనిపిస్తోందని విమర్శించారు. పట్టభద్రుల సమస్యలపై నిరంతరం పోరాడే స్వతంత్ర అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. రాజకీయ పార్టీలకు అతీతంగా నిజాయితీ, ప్రజాసేవా దృక్పథం ఉన్న వ్యక్తులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. డబ్బులు, ప్రలోభాలకు లొంగి ఓటు వేస్తే పట్టభద్రుల హక్కుల కోసం ప్రశ్నించే నైతిక బలం కోల్పోతారని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయకుండా ప్రైవేటు విద్యాసంస్థల విస్తరణకు అవకాశం కల్పిస్తున్నారని ఆరోపించారు. పట్టభద్రుల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు వారి సమస్యలను శాసనమండలిలో బలంగా ప్రస్తావించాల్సిన బాధ్యత ఉందన్నారు. జర్నలిస్టులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు కలిసి పట్టభద్రుల ఆకాంక్షల కోసం ఐక్యంగా నిలవాలని పిలుపునిచ్చారు. రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తాను కూడా పోటీ చేయనున్నట్లు డాక్టర్ బరిగెల శివ ప్రకటించారు.

- హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

2

## ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

ఉస్మానియా, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల పనులు వేగవంతం చేయాలి

ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ నిర్మాణంపై ప్రత్యేక దృష్టి

ఆసుపత్రులు పూర్తయ్యే నాటికి వైద్యులు, సిబ్బంది సిద్ధంగా ఉండాలి

అత్యాధునిక వైద్య పరికరాలను ముందుగానే సమకూర్చాలి

విద్య, వైద్య రంగాలపై జిల్లాల్లో ప్రతి వారం సమీక్ష

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీనగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది కొరత లేకుండా ముందస్తు ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు.

- హైదరాబాద్, జై భీమ్ న్యూస్

7



## పెళ్లిలో పెళ్లికాని ప్రసాదులు!

పల్లెల్లో పెరుగుతున్న ఆలస్య వివాహాలు.. ఉపాధి కొరతతో 40 ఏళ్లు దాటినా సింగిల్‌గానే

భారత్‌లో సంతానోత్పత్తి రేటు తగ్గుముఖం.. గ్రామీణ యువత పరిస్థితిపై ఆందోళన

8



## తిరుపతి జిల్లాలో షాకింగ్ ఘటన

భర్తను హత్య చేసేందుకు భార్యతో పాటు ప్రియుడి కుట్ర?

బైక్‌కు నిప్పు పెట్టిన ఘటనపై దర్యాప్తులో సంచలన విషయాలు

సీసీటీవీ ఆధారంగా ఐదుగురు యువకుల గుర్తింపు

విచారణలో బైక్‌కు నిప్పు పెట్టినట్లు అంగీకారం?

భార్యకు యువకుడితో సన్నిహిత సంబంధం ఉన్నట్లు పోలీసుల అనుమానం

ఈ వ్యవహారంలో ఏడుగురి అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు

## ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌తో తెలంగాణ మంత్రుల ప్రయాణం

డే పాస్‌తో ఆర్టీసీ బస్సు, మెట్రో రైలులో ప్రయాణం

బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్న మంత్రులు

బేగంపేట నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మెట్రోలో ప్రయాణం

ప్రజా రవాణాను మరింత సులభతరం చేయడమే లక్ష్యం

భవిష్యత్‌లో ఆటోలు, క్యాబ్‌లకు అనుసంధానం చేసే ఆలోచన

హైదరాబాద్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)



తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పలువురు మంత్రులతో కలిసి శనివారం ఆర్టీసీ బస్సు, మెట్రో రైలులో ప్రయాణించారు. ప్రజలకు ప్రభుత్వ రవాణాను మరింత సులభతరం చేయడం కోసం ఆర్టీసీ-మెట్రో కామన్ పాస్‌ను తీసుకొచ్చినట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క తెలిపారు. భవిష్యత్‌లో ఈ పాస్‌ను ఆటోలు, క్యాబ్‌లకు కూడా అనుసంధానించే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. డే పాస్‌తో మంత్రులతో కలిసి ఆర్టీసీ బస్సులో బేగంపేట మెట్రో స్టేషన్‌కు చేరుకున్న భట్టి విక్రమార్క.. అక్కడి నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. తనతో పాటు ప్రయాణించిన మంత్రులకు భట్టి విక్రమార్క కాంబో పాస్ కొనుగోలు చేశారు. హైదరాబాద్ నగరంలో ట్రాఫిక్ రద్దీని నియంత్రించడంతో పాటు ప్రజలను ప్రజా రవాణా వైపు ఆకర్షించేందుకు ఈ పాస్‌ను తీసుకొచ్చినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ప్రస్తుతం కాంబో పాస్‌లను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నామని, ప్రజలపై అదనపు ఆర్థిక భారం పడకుండా చూస్తామని వెల్లడించారు. కాంబో పాస్‌తో ప్రయాణించిన మంత్రుల్లో వివేక్, అజారుద్దీన్ తదితరులు ఉన్నారు.

## గౌరవెల్లి ప్రాజెక్టు పనులకు వేగం పెంచాలి: మంత్రులు ఉత్తమ్, పొన్నం

భూసేకరణ, పునరావాసం, పర్యావరణ అనుమతులపై సమీక్ష

కాలువల పనుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు

భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.17 లక్షల పరిహారం

సవరించిన అంచనాలు, పెండింగ్ అనుమతులపై అధికారులకు ఆదేశాలు

నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాలని సూచన

2



జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem

## గౌరవెల్లి ప్రాజెక్టు పనులకు వేగం పెంచాలి: మంత్రులు ఉత్తమ్, పొన్నం

**భూసేకరణ, పునరావాసం, పర్యావరణ అనుమతులపై సమీక్ష**
**కాలువల పనుల్లో ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు**
**భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.17 లక్షల పరిహారం**
**సవరించిన అంచనాలు, పెండింగ్ అనుమతులపై అధికారులకు ఆదేశాలు**
**నిర్దేశిత లక్ష్యాల మేరకు పనులు పూర్తి చేయాలని సూచన**




**హైదరాబాద్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్):**

గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టు పనుల పురోగతిపై నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం, పర్యావరణ అనుమతులు, సవరించిన అంచనాలు, కాలువల నిర్మాణ పనులు, నీటి నిల్వలు తదితర అంశాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2007లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డా. వై.ఎస్. రాజశేఖర రెడ్డి చేతుల మీదుగా గౌరవెల్లి రిజర్వాయర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగిందని, 2013 నాటికి సుమారు 57 శాతం పనులు పూర్తయ్యాయని అధికారులు మంత్రులకు వివరించారు. అనంతరం వివిధ పరిపాలనా కారణాలతో భూసేకరణ ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుందని తెలిపారు. 2023లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గౌరవెల్లి ప్రాజెక్టుకు అవసరమైన భూసేకరణపై ప్రత్యేక దృష్టి సారించడంతో గణనీయమైన పురోగతి సాధించినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన భూసేకరణను కూడా వేగవంతం చేసి ప్రాజెక్టు పనులను ముందుకు తీసుకెళ్లాలని మంత్రులు ఆదేశించారు. గౌరవెల్లి రిజర్వాయర్ కోసం భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూ.17 లక్షల చొప్పున పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని మంత్రులు సూచించారు. వివాహిత కుమార్తెలకు పునరావాస ప్రయోజనాలు, పాత, కొత్త ముంపు ప్రాంతాల పరిధిలోని కుటుంబాలకు సంబంధించిన అంశాలను కూడా సమావేశంలో సమీక్షించారు. గౌరవెల్లి కాలువలకు సంబంధించిన భూసేకరణ పురోగతిని కూడా మంత్రులు పరిశీలించారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో నిధులు విడుదల చేసి లబ్ధిదారులకు పరిహారం చెల్లింపులు కొనసాగుతున్నాయని అధికారులు వివరించారు. మిగిలిన భూసేకరణను వేగవంతం చేసి కాలువల పనులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రులు ఆదేశించారు. ఇదే సమయంలో గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించిన తాజా పర్యావరణ అనుమతుల అంశంపై కూడా చర్చించారు. సంబంధిత కేంద్ర సంస్థల మార్గదర్శకాలకు అనుగుణంగా అవసరమైన తాజా పర్యావరణ అనుమతులు పొందేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు వివరించారు. భూసేకరణ, పునరావాసం, ధరల పెరుగుదల తదితర కారణాలతో గౌరవెల్లి రిజర్వాయర్, కాలువలకు సంబంధించిన సవరించిన అంచనాలను ప్రభుత్వానికి సమర్పించినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన పనులకు పరిపాలనా అనుమతులు పొందిన అనంతరం టెండర్ల ప్రక్రియ చేపట్టనున్నట్లు సమావేశంలో వెల్లడించారు. ఎంఎంఆర్ ప్యాకేజీ-3 పనులకు సంబంధించిన సవరించిన అంచనాలు, అదనపు నిర్మాణాల ప్రతిపాదనలు, భవిష్యత్ కార్యాచరణపై కూడా సమీక్ష జరిగింది. అవసరమైన పర్యావరణ అనుమతులు, ఇతర ప్రభుత్వ అనుమతులు పొందిన వెంటనే గౌరవెల్లి రిజర్వాయర్ పనులను వేగంగా ముందుకు తీసుకెళ్లాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని పెండింగ్ అంశాలను నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పరిష్కరించాలని సూచించారు. భూసేకరణ, పునరావాసం, అనుమతులు తదితర అంశాల్లో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకుని ప్రాజెక్టు పనులను నిర్దేశిత లక్ష్యాల మేరకు పూర్తి చేసే దిశగా ముందుకు సాగాలని మంత్రి స్పష్టం చేశారు. సమావేశంలో నీటిపారుదల శాఖ కార్యదర్శి ఇ. శ్రీధర్, భూసేకరణ--పునరావాస కమిషనర్ శివకుమార్ నాయుడు, ఈఎన్సీ జనరల్ రమేష్ బాబు, ఈఎన్సీ ఓఎం మధుసూదన్ రావు, జాయింట్ సెక్రటరీ కె. శ్రీనివాస్‌తో పాటు మూడు జిల్లాలకు చెందిన అధికారులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తిరుపతి జిల్లాలో షాకింగ్ ఘటన

**భర్తను హత్య చేసేందుకు భార్యతో పాటు ప్రియుడి కుట్ర?**

**తిరుపతి, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్):**

భర్తను హత్య చేసేందుకు భార్య తన ప్రియుడితో కలిసి కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించిన ఘటన తిరుపతి జిల్లా చంద్రగిరిలో వెలుగులోకి వచ్చింది. చంద్రగిరి బీజేపీ మండల అధ్యక్షుడు మునిరాజా బైక్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టిన ఘటనపై పోలీసులు చేపట్టిన దర్యాప్తులో ఈ వ్యవహారం బయటపడినట్లు సమాచారం. ఈ నెల 13న మునిరాజా బైక్‌కు నిప్పు పెట్టడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ దృశ్యాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో చంద్రగిరికి చెందిన సాయి, ఉదయ్‌కిరణ్, లీలాకృష్ణ, పృథ్వీరాజ్, హరీష్ అనే ఐదుగురిని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా బైక్‌కు నిప్పు పెట్టినట్లు అంగీకరించినట్లు సమాచారం. అనంతరం మరింత లోతుగా విచారించడంతో ఘటన వెనుక ఉన్న కుట్ర వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు పేర్కొన్నారు. మునిరాజా భార్య ప్రశాంతికి సాయి అనే యువకుడితో సన్నిహిత సంబంధం ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. ఈ సంబంధానికి భర్త అడ్డుగా ఉన్నాడని భావించి మునిరాజాను హత్య చేసేందుకు ఇద్దరూ కలిసి ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. భర్తను హత్య చేసేందుకు గతంలోనూ ప్రయత్నాలు జరిగినట్లు దర్యాప్తులో తేలిందని, బైక్‌కు నిప్పు పెట్టడం కూడా అందులో భాగమేనా అనే కోణంలో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ వ్యవహారంలో మునిరాజా భార్యతో పాటు పలువురు యువకుల ప్రమేయం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. ఘటనకు సంబంధించిన మరిన్ని వివరాలను పోలీసులు దర్యాప్తు అనంతరం వెల్లడించే అవకాశం ఉంది. భర్త హత్యకు కుట్ర చేశారన్న ఆరోపణలు దర్యాప్తులో ఉన్న నేపథ్యంలో సీసీటీవీ దృశ్యాలు, నిందితుల వాంగ్మూలాలు, ఇతర ఆధారాల ఆధారంగా కేసులో వాస్తవాలను పోలీసులు నిర్ధారించాల్సి ఉంది.

# పట్టభద్రులకు "భద్రత" ఎక్కడ

**పట్టు కోల్పోతున్న పట్టభద్రులు**
**ఎన్నికలప్పుడే హడావుడి**
**రాష్ట్రాన్ని వెంటాడుతున్న నిరుద్యోగ సమస్య**
**పట్టభద్రులైన విద్యార్థులకు అనేక రకాల అవమానాలు జరుగుతున్నాయి**
**నాయకులకు వ్యక్తిగత స్వార్థమే తప్ప సేవా భారం లేదు**
**రాజకీయ పార్టీలకు పట్టభద్రుల ఎమ్మెల్సీఅభ్యర్థులు దూరంగా ఉండాలి**
**స్వతంత్ర్యంగా పోరాడితేనే తప్ప పట్టభద్రులకు మేలు జరగదు**
**సంవత్సరాలు గడుస్తున్న సారెడు అభివృద్ధి లేదు**
**రాష్ట్రంలో జోరుగా అభివృద్ధి చెందుతున్న ప్రైవేటు విద్యాసంస్థలు**
**పట్టభద్రులే డబ్బులు తీసుకొని ఓట్లేస్తే విలువలు ఎక్కడ ఉంటాయి**
**డాక్టర్ బరిగెల శివ**

**హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)**

రాష్ట్రంలో ఏ పార్టీకి చెందిన రాజకీయ నాయకుడైన ప్రభుత్వాలకు లొంగి పనిచేయాల్సిందేనని డాక్టర్ బరిగెల శివ తీవ్రంగా హెచ్చరించారు.వరంగల్ ఖమ్మం నల్గొండ,మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్,పట్టభద్రుల ఎమ్మెల్సీ రెండు స్థానాలకు గాను మార్చి 27 తో గడువు పూర్తి అవుతుండగా అధికార కాంగ్రెస్ పార్టీ అప్పటికే రెండు స్థానాలకు సంబంధించిన ఎమ్మెల్సీ అభ్యర్థులను రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సామ రామ్మోహన్ రెడ్డి,రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పేర్లను ఖరారు చేసినట్లు విశ్వాసనీయ సమాచారంగా తెలిపారు.సామాజిక న్యాయాన్ని పాటిస్తూ సీట్లను కేటాయించాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి సామాజిక వర్గానికి ప్రాధాన్యతనిచ్చి రెండు సీట్లను రెడ్డిలకు కేటాయించడం విశేషంగా మారి విమర్శలకు దారితీస్తుందన్నారు.రాజకీయ పార్టీల ఎమ్మెల్సీలు పట్టబద్రులకు ఏమాత్రం న్యాయం చేయలేరనేది స్పష్టంగా తేలిపోతుందన్నారు.2000 సంవత్సరం నుండి 2026 సంవత్సరం వరకు తెలంగాణ ప్రాంతంలో పట్టభద్రుల భవిష్యత్తు పూర్తిగా సన్నగిల్లిందని పట్టభద్రుల అభివృద్ధి పూర్తిగా నశించిందని సూటిగా నిలదీశారు.అధికార ప్రభుత్వాలకు వంత పాడడం పట్టభద్రుల ఎమ్మెల్సీలుగా ఎన్నిక చేయబడిన ఎమ్మెల్సీలు వాళ్ల సహకారాన్ని ప్రభుత్వాలకు మద్దతుగా మాత్రమే కొనసాగించి మేధావి వర్గానికి చెందిన పట్టభద్రులను తీవ్రంగా విడమరిచారని గుర్తు చేశారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పట్టభద్రుల ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున విద్యా వ్యాపారాలకు పాల్పడినట్లు తెలంగాణ రాష్ట్రంలోని మేధావులు తీవ్రమైన అనుమానాలను వ్యక్తం చేస్తుండగా తెలంగాణ రాష్ట్రంలో ప్రస్తుతం బలమైన విద్యాసంస్థలుగా కొనసాగుతున్న విద్యాసంస్థలన్నీ తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఏర్పాటు చేయబడినవేనని పరోక్షంగా హెచ్చరించారు.పట్టబద్రుల జీవితాలపై తీరని నిరుత్సాహాన్ని మిగిల్చిన ఎమ్మెల్సీలు శాసనమండలి సభలో పట్టబద్రుల సమస్యల పట్ల పోరాటాలు చేసిన దాఖలాలు ఎక్కడా లేవన్నారు.పైగా బీఆర్ఎస్ హయంలో ఏడు ప్రైవేటు విశ్వవిద్యాలయాలు కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇప్పటికే ఇంచుమించు 11 ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు అనుమతులు పొందుకొని ప్రైవేటు విద్యారంగాన్ని పెంచి పోషిస్తున్నారని వాటిపై గత ఎమ్మెల్సీలు ప్రస్తుతం ఎమ్మెల్సీలు ఏమాత్రం పోరాటం చేయకుండా పదవి కాలాలను రాజకీయానికి వాడుకున్నారే తప్ప ప్రభుత్వ విద్యను పట్టభద్రుల జీవితాలను అభివృద్ధి



పరుచలేకపోయారని వాపోయారు.

**ఓట్ల కోసం కోట్ల తిప్పలు..**

పట్టభద్రులు అంటేనే పరిజ్ఞానవంతులని డిగ్రీ పట్టాలు పొందుకున్న మేధావులందరూ ఓట్లు వేసి గెలిపించుకునే పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థులు వాళ్ళ పదవులలో అధికార దాహంలో పడి "పట్టాలకే" పరిమితమై" భద్రత "లేకుండా పోయారని సూటిగా నిలదీశారు.మేధావి వర్గానికి చెందిన పట్టభద్రుల ఓట్లను పొందుకోవడానికి పోటీలో నిలుస్తున్న అభ్యర్థులందరూ పట్టబద్రులను ఆకర్షించడానికి సంబంధంలేని, ఆచరణకు సాధ్యం కానీ హామీలను ప్రకటించి ఎన్నికల్లో పోటీ చేస్తూ సామాజిక వర్గం పేరు మీద ఉద్యోగ వర్గం పేరు మీద ప్రైవేట్ వర్గం పేరుమీద ప్రభుత్వ వర్గం పేరు మీద పట్టబద్రుల ఓట్లను దండుకోవడానికి తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారని గుర్తు చేశారు.మేధావులను వెక్కిరించే విధంగా పట్టభద్రులను సైతం తీవ్రమైన ప్రలోభాలకు గురి చేస్తూ ఓట్ల కోసం కోట్ల అబద్దాలాడుతూ బొల్తా కొట్టించే ప్రయత్నాలు నేటికీ సాగిస్తున్నారని అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.ఓట్లను రాబట్టడం కోసం కావాల్సిన ప్రయత్నాలన్నీ చేస్తూ పట్టభద్రులైన మేధావులను సైతం రాజకీయ ముసుగులో మోసం చేస్తున్నారని మండిపడ్డారు.రాజకీయ ఎన్నికల మాదిరిగానే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు కూడా విపరీతమైన ఖర్చుతో కూడుకున్నవిగా ఎన్నికలు నిర్వహించబడుతున్న విధానం ఎన్నికలలో అభ్యర్థులు డబ్బులు ఖర్చు చేస్తున్న విధానం స్పష్టంగా తెలియజేస్తుందన్నారు.

**థాయిలాల కోసం తాకట్టు పడుతున్నారు..**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీలో పాల్గొనే అభ్యర్థులు పంచే డబ్బుల కోసం పట్టబద్రులైన మేధావులు సైతం ఓట్ల కోసం డబ్బులు తీసుకోవడానికి వెనకాడడం లేదంటే రాజకీయ ప్రభావం పట్టబద్రులను ఎంతలా ఆకర్షిస్తుందో తెలంగాణ సమాజం అర్థం చేసుకోవాలన్నారు. విద్యావంతులు పరిజ్ఞానవంతులు ఏకమై పట్టబద్రుల సమస్యల పట్ల నిత్యం పోరాడే సామర్థ్యం కలిగిన ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించుకొని పట్టభద్రుల జీవితాల అభివృద్ధి కోసం పాటుపడాల్సింది పోయి అభ్యర్థులు పంచుతున్న డబ్బులకు ఆశపడి ఓట్లను అమ్ముకొని అసమర్ధులైన అభ్యర్థులను ఎమ్మెల్సీలుగా గెలిపించుకొని గెలిచిన అభ్యర్థులు పట్టభద్రుల సంక్షేమం కోసం పనిచేయకుండా పోవడం వల్ల పట్టభద్రుల అభివృద్ధి జరగడం లేదంటూ రోడ్లెక్కి ఉద్యమాలు, పోరాటాలు,ధర్నాలు, చేస్తున్నారని తీవ్రంగా విమర్శించారు.ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించుకోవడంలో పట్టబద్రులు ఓడిపోతున్నారని ప్రతి సందర్భంలో ప్రతి ఎన్నికల్లో ప్రలోభాలకు లోనవుతూ పైసలకు లోనవుతూ మాత్రమే ఓట్లు వేస్తున్నారు తప్ప నిజాయితీ కలిగిన అభ్యర్థిని గెలిపించుకోవడానికి సాహ సం చేయలేకపోతు న్నారని గుర్తు చేశారు.రాజకీయ నాయకులను ఎన్నుకునే ముందు సామాన్యులవలే కాకుండా బాధ్యత కలిగిన మేధావులుగా కట్టబద్రులుగా విద్యార్థులుగా ఉద్యోగులుగా తగినటువంటి నిజాయితీని కనపరుస్తూ నీతి నియమాలతో నీతి నిజాయితీతో అభ్యర్థులను ఎన్నుకొని పట్టబద్రుల సమస్యల పరిష్కారాలకు ఉపయోగించుకోవాలని అన్నారు.రాష్ట్రంలో విద్యా వ్యవస్థల పరిస్థితి విభిన్నమైన స్థాయిలో కొనసాగుతుండగా సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్యా ప్రమాణాలు దినదినానికి పెరుగుతూ ఉంటున్నందున ప్రభుత్వ విద్యకు ప్రైవేటు విద్యకు ఎక్కడ లేనంత వ్యత్యాసం ఉందన్నారు.ప్రభుత్వ విద్యను అభివృద్ధి చేయాల్సిన ప్రభుత్వాలు వాటిని పట్టించుకోకుండా పోవడంతో ప్రభుత్వ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు పట్టబద్రుల రూపంలో తీవ్రంగా నష్టపోతున్నారని అదే తరుణంలో ప్రైవేటు విద్యా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో పట్టభద్రులు ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్సీలు ప్రైవేట్ విద్యాభివృద్ధికి సహకరిస్తూ ఆర్థికంగా అభివృద్ధి చెందుతున్నారని మొత్తం మీదుగా ఎమ్మెల్సీలను ఓట్లేసి గెలిపించిన పట్టభద్రులు యధాస్థితిలో ఉంటూ అభివృద్ధికి నోచుకోక తీవ్రంగా నష్టపోతుంటే గెలుపొందిన ఎమ్మెల్సీలు కార్పొరేట్ విద్యాసంస్థలు మాత్రం లెక్కలేనంతగా అభివృద్ధి చెందుతున్నాయని వాటికి తోడు ప్రభుత్వాలు ప్రైవేట్ విద్యతో వ్యాపారాలు చేస్తున్నారని మండిపడ్డారు.విద్యా సంక్షేమానికి కృషి చేయాల్సిన ఎమ్మెల్సీలు ఎన్నికల్లో గెలుపొందగానే వాటిపై అనుకున్న స్థాయిలో దృష్టి పెట్టకపోతుండడం వల్ల ప్రభుత్వ విద్య అభివృద్ధి అనేది పూర్తిస్థాయిలో కుంటుపడిపోతుందని అన్నారు.ప్రభుత్వాలతో పోరాడుతూ ప్రభుత్వాలను మెప్పించి ప్రభుత్వ విద్య అభివృద్ధి కోసం పూర్తిస్థాయిలో కష్టపడాల్సిన పట్టభద్రుల ఎమ్మెల్సీలు అనుకున్న స్థాయి ఫలితాలను రాబట్టడంలో ఏ ఒక్కరు సఫలీకృతం కాలేకపోయారని అన్నారు.ఇప్పటివరకు ఎమ్మెల్సీ అభ్యర్థుల రాజకీయ ప్రస్థానాలను గమనించినప్పుడు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపొందిన వ్యక్తులు రాజకీయంగా ఆర్థికంగా సామాజికంగా అభివృద్ధి చెందారే తప్ప ఓట్లు వేసి గెలిపించిన పట్టబద్రులను ఏ ప్రస్థానంలో కూడా గెలిపించలేకపోయారని పైగా ప్రభుత్వాలు పట్టభద్రులను నిరుద్యోగులను ఉద్యోగులను పెడుతున్న వేధింపులలో ,ఇబ్బందులలో,దగ్గరుండి సహకరించారని అన్నారు.

**ఎమ్మెల్సీల ఎంపికలో అలసత్వం వద్దు..**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు అనగానే అధికార పార్టీ అభ్యర్థులను ప్రతిపక్ష పార్టీ అభ్యర్థులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు అనుకూలంగా ఉన్న అభ్యర్థులను రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయిస్తూ నిలబెడుతున్న అభ్యర్థులను గెలిపించడంలో పట్టభద్రులు చూపిస్తున్న ఉశ్చుకత,ఉత్సాహం,ఆరాటం, ఉబలాటం,అత్యుత్సాహం, స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచి నిజాయితీ కలిగిన వ్యక్తులను గెలిపించుకోవడానికి ముందుకు రాకపోవడం ఎంతో విచారకరమన్నారు.ప్రస్తుతం జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఎక్కువ శాతం పట్టభద్రులు ప్రజాస్వామ్యవాదులు జర్నలిస్టులు మేధావులు అధిక సంఖ్యలో నామినేషన్లు వేసి జేఏసీగా ఏర్పడి పట్టభద్రుల ఆకాంక్షలను పట్టభద్రుల సంక్షేమాలను కాపాడడం కోసం అభివృద్ధి చేయడం కోసం ఎవరైతే నిజాయితీగా పాటుపడి వ్యక్తిగత పూచికత్తుతో ఎన్నికల్లోకి వచ్చి పోటీ చేసి నిలబడతారో వాళ్లను గెలిపించుకోవడం కోసం సమిష్టిగా పోటీలో నిలువాలని పిలుపునిచ్చారు.ప్రధానంగా జర్నలిస్టులంతా పట్టభద్రుల ఆశయాల కోసం నిలబడే వ్యక్తులకు మాత్రమే సహకరిస్తూ కలం రూపంలో గళం విప్పాలని వాళ్ళ కలంతో పట్టభద్రులను మేల్కొల్పాలని రాజకీయ పార్టీలకు సంబంధించిన అభ్యర్థులకు చుక్కలు చూపించాలని కోరారు.ఐక్య పోరాటాలతో సాధించనది ఏదీ లేదంటూ తెలుపుతూ తెలంగాణ రాష్ట్రంలో పట్టభద్రులు పడుతున్న అనేక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపిక కులాలకు రాజకీయ పార్టీలకు, అతీతంగా స్వతంత్ర అభ్యర్థుల వైపు మొగ్గుచూపుతుండడంతో సామాజిక బాధ్యతతో సాంకేతిక బాధ్యతతో ప్రజాస్వామ్య బాధ్యతతో నిజాయితీ కలిగిన వ్యక్తులను ఎంపిక చేసుకోవాలని కోరారు.

**నేను సైతం ఎమ్మెల్సీ బరిలో.....త్వరలో పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలో బరిగెల శివ అతి త్వరలో..**

## సీఎన్‌జీ వాహనాలు వాడుతున్నారా? ఈ జాగ్రత్తలు తప్పనిసరి

**హైద్రాబాద్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

సీఎన్‌జీ వాహనాలను వినియోగించే వాహనదారులు భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. సీఎన్‌జీ సిలిండర్లలో అధిక ఒత్తిడితో వాయువును నింపి నిల్వ చేస్తారు. దీంతో సిలిండర్, దాని అనుబంధ పరికరాల విషయంలో నిర్లక్ష్యం చేస్తే లీకేజీ, అగ్ని ప్రమాదం వంటి ప్రమాదాలకు అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. సీఎన్‌జీ సిలిండర్లను నిర్ణీత కాల వ్యవధిలో తప్పనిసరిగా పరీక్షించుకోవాలి. సిలిండర్‌కు ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి హైడ్రాలిక్ పరీక్ష చేయించి, దాని సామర్థ్యం, భద్రతను నిర్ధారించుకోవాలని సూచిస్తున్నారు. సిలిండర్‌లో పగుళ్లు, తుప్పు, లీకేజీలు లేదా ఇతర లోపాలు ఉన్నాయా అనే విషయాన్ని నిపుణులతో తనిఖీ చేయించుకోవాలి. పరీక్షల గడువు ముగిసిన సిలిండర్లను వినియోగించకుండా సంబంధిత భద్రతా నిబంధనలను పాటించాలి. సీఎన్‌జీ పరికరాలను వాహనంలో అమర్చేటప్పుడు కూడా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. నాణ్యత లేని లేదా ధ్రువీకరణ లేని పరికరాలను ఉపయోగించడం వల్ల ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా సీఎన్‌జీ కిట్, గ్యాస్ పైపులు, వాల్వులు, నియంత్రణ పరికరాలు, విద్యుత్ వైరింగ్ వంటి వాటిని ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నవే ఉపయోగించాలి. అనధికారిక వ్యక్తులతో కిట్ అమర్చించడం, వైరింగ్‌లో స్వయంగా మార్పులు చేయడం వంటివి పూర్తిగా నివారించాలి. ఇంధనం నింపే సమయంలో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలి. సీఎన్‌జీ నింపేటప్పుడు వాహనం ఇంజిన్‌ను తప్పనిసరిగా ఆపివేయాలి. వాహనంలో ఉన్న ప్రయాణికులను బయటకు దించాలి. ఇంధనం నింపే ప్రదేశంలో పొగ తాగడం, మంట వెలిగించడం లేదా విద్యుత్ స్పార్క్‌కు కారణమయ్యే చర్యలు చేయకూడదు. ఇంధనం నింపే సమయంలో సిబ్బంది సూచనలు తప్పనిసరిగా పాటించాలి. వాహనం నుంచి సీఎన్‌జీ వాసన రావడం, గ్యాస్ లీకేజీ అనుమానం కలగడం, అసాధారణ శబ్దాలు వినిపించడం వంటి పరిస్థితుల్లో వాహనాన్ని వెంటనే సురక్షిత ప్రదేశంలో నిలిపి ఇంజిన్‌ను ఆపివేయాలి. అటువంటి సమయంలో మంటలు వెలిగించకూడదు. విద్యుత్ పరికరాలను ఆన్ చేయకుండా, వెంటనే అధీకృత సాంకేతిక నిపుణులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలి. అదేవిధంగా వాహనదారులు సీఎన్‌జీ వ్యవస్థను క్రమం తప్పకుండా తనిఖీ చేయించుకోవాలి. సిలిండర్ పరీక్ష తేదీ, గ్యాస్ పైపులు, వాల్వులు, నియంత్రణ పరికరాలు, వైరింగ్, బ్యాటరీ కనెక్షన్లు తదితరాలను పరిశీలించాలి. పాతబడిన లేదా దెబ్బతిన్న పరికరాలను వెంటనే మార్చుకోవాలి. వాహనంలో అదనపు విద్యుత్ పరికరాలను అమర్చేటప్పుడు కూడా నిపుణుల సలహా తీసుకోవాలి. ×సీఎన్‌జీ వాహనాల్లో నాసిరకం పరికరాలు, అనధికారిక మార్పులు, లోపభూయిష్టమైన వైరింగ్ కారణంగా విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ లేదా గ్యాస్ లీకేజీ వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందువల్ల ధ్రువీకరించబడిన, నాణ్యమైన సీఎన్‌జీ పరికరాలను మాత్రమే ఉపయోగించడంతో పాటు, అధీకృత కేంద్రాల్లోనే తనిఖీలు, మరమ్మతులు చేయించుకోవాలి. సీఎన్‌జీ వాహనాలను వినియోగించడం వల్ల ఇంధన వ్యయం తగ్గడంతో పాటు కాలుష్యాన్ని తగ్గించడంలో కూడా ప్రయోజనం ఉన్నప్పటికీ, భద్రత విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం చేయకూడదని నిపుణులు సూచిస్తున్నారు. వాహనదారులు సిలిండర్ పరీక్షలు, కిట్ తనిఖీలు, గ్యాస్ లీకేజీ పరిశీలన, విద్యుత్ వైరింగ్ భద్రత, వాహన నిర్వహణ తదితర అంశాలపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. వాహనదారులు స్వల్పమైన లోపాన్ని కూడా నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సంబంధిత నిపుణులను సంప్రదించి మరమ్మతులు చేయించుకోవాలి. ఇంధనం నింపే సమయంలో ఇంజిన్ ఆపివేయడం, ప్రయాణికులను బయటకు దించడం, మంటలు, స్పార్క్‌లకు దూరంగా ఉండటం, సిలిండర్‌ను నిర్ణీత కాలానికి పరీక్షించుకోవడం వంటి జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ పాటిస్తే ప్రమాదాలను గణనీయంగా తగ్గించుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా Jai Bheem TV STRUGGLE FOR JUSTICE సామాన్యుడి ఆయుధంగా

# పెద్దకొత్తపల్లిలో ఘనంగా మహేంద్రనాథ్ విగ్రహావిష్కరణ

**గాంధీ జయంతి సందర్భంగా మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ సేవలను స్మరించుకున్న ప్రజాప్రతినిధులు**



**నాగర్‌కర్నూల్(జై భీమ్ న్యూస్)**

నాగర్‌కర్నూల్ జిల్లా, పెద్దకొత్తపల్లి,గాంధీ జయంతి సందర్భంగా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో దివంగత మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్తో పాటు ఎంపీ మల్లు రవి, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితర ప్రజాప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొని మహేంద్రనాథ్ విగ్రహానికి నివాళు లర్పించారు. ప్రజా జీవితంలో నీతి, నిజాయితీ, ప్రజాసేవకు అంకితమైన నాయకుడిగా పుట్టపాగ మహేంద్రనాథ్ ప్రత్యేక గుర్తింపు పొందారని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఆయన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ప్రజా సమస్యల పరిష్కారానికి, ముఖ్యంగా అణగారిన వర్గాల అభ్యున్నతికి కృషి చేశారని గుర్తుచేశారు. మహేంద్రనాథ్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎన్టీ రామారావు మంత్రివర్గంలో 1983–84లో రెవెన్యూ శాఖ మంత్రిగా,1985–89లో ఆర్థిక శాఖ మంత్రిగా పనిచేశారు. 1985–89 మంత్రివర్గ వివరాల్లో ఆయన ఆర్థిక మంత్రిగా ఉన్నట్లు చారిత్రక రాజకీయ రికార్డులు పేర్కొంటున్నాయి. రెవెన్యూ మంత్రిగా ఉన్న సమయంలో పటేల్–పట్వారి వ్యవస్థ రద్దు,భూ పరిపాలనలో సంస్కరణలు, పట్టాదారు పాసుపుస్తకాల ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించే చర్యలు వంటి అంశాల్లో ఆయన పాత్ర ఉందని చారిత్రక రచనలు పేర్కొంటున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, విద్యా సంస్థలు, మార్కెట్ యార్డులు, బస్ డిపోలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు కూడా ఆయన కృషి చేశారని పేర్కొంటున్నాయి. 1985లో ఎన్టీఆర్ మంత్రివర్గంలో ఆర్థిక శాఖ బాధ్యతలు చేపట్టిన తొలి దళిత నాయకుడిగా మహేంద్రనాథ్ గుర్తింపు పొందారని ఆయనపై వచ్చిన చారిత్రక కథనాలు పేర్కొంటున్నాయి. ఆర్థిక వ్యవహారాలపై ఆయనకు ఉన్న అవగాహనతో రాష్ట్ర ఆర్థిక విధానాల రూపకల్పనలో తనదైన పాత్ర పోషించారు. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో నిర్వహించిన విగ్రహావిష్కరణ కార్యక్రమంలో మహేంద్రనాథ్ సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరాన్ని ప్రజాప్రతినిధులు ప్రస్తావించారు. సమాజంలోని అణగారిన వర్గాల అభివృద్ధి, విద్య, సామాజిక న్యాయం కోసం ఆయన చేసిన కృషి భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని తెలిపారు. మహేంద్రనాథ్‌తో పాటు మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహాన్ని కూడా పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఆవిష్కరించారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పూలే చేసిన పోరాటాన్ని, ప్రజా సేవలో మహేంద్రనాథ్ అందించిన సేవలను స్మరించుకుంటూ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహేంద్రనాథ్ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహేంద్రనాథ్ విగ్రహావిష్కరణతో ఆయన ప్రజాసేవా చరిత్రకు పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో శాశ్వత గుర్తింపు లభించిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: మంత్రి లక్ష్మణ్ కుమార్

**మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించిన డీబీఎఫ్ నాయకులు**




**హైద్రాబాద్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను డీబీఎఫ్ తెలంగాణ రాష్ట్ర నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం హైదరాబాద్‌లోని పరిశ్రమల భవన్‌లో మంత్రి లక్ష్మణ్ కుమార్‌కు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ వర్గాల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. ప్రజా సంఘాలు, దళిత సంఘాలకు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఆయా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతూ, వారి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రజా సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. అనంతరం డీబీఎఫ్ నాయకులు మంత్రి లక్ష్మణ్ కుమార్‌ను ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్, తెలంగాణ రాష్ట్ర డీబీఎఫ్ అధ్యక్షులు రౌతు రమేష్ కుమార్, సర్వయ్య, ఆశ శ్రీరాములు, మెట్ల శంకర్, గూడపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్ వద్ద ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి

**పిడిఎస్యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం డిమాండ్**

**వరంగల్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్ సమీపంలో కేజీ నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం పిడిఎస్యూ ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పిడిఎస్యూ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్రి మహేష్ మాట్లాడుతూ.. గీసుకొండ మండలం శాయంపేట గ్రామం సమీపంలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్‌లో యంగోనె కార్పొరేషన్––సౌత్ కొరియన్, గణేశా ఎక్స్‌పోర్ట్స్/గణేశా ఎకోపెట్, కిట్స్ గ్రూప్ తదితర సంస్థల్లో ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు తమ కుటుంబ సభ్యులతో కలిసి పనిచేస్తున్నారని తెలిపారు. వారి పిల్లలకు సమీపంలో ప్రభుత్వ పాఠశాల అందుబాటులో లేకపోవడంతో విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది చిన్న వయస్కులు కూడా కంపెనీల్లో పనిచేస్తున్నారని, బాల కార్మికత్వాన్ని అరికట్టడంతో పాటు పిల్లలందరికీ విద్య అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతి కంపెనీలో పనిచేసే కార్మికుల పిల్లలు సుమారు 100 మందికి పైగా ఉన్నారని, మూడు కంపెనీలను కలిపి సుమారు 300 మంది పిల్లలు విద్యకు దూరమయ్యే పరిస్థితి ఉందని మహేష్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్క్ సమీపంలోనే కేజీ నుంచి 10వ తరగతి వరకు ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేసి, పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్య అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్యూ జిల్లా నాయకులు సంతోష్, సాగర్, హేశ్వంత్, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.




# బీసీ లా గ్రాడ్యుయేట్లకు న్యాయవాద శిక్షణ.. దరఖాస్తులకు ఆహ్వానం



జిల్లా వె.త. అభివృద్ధి అధికారి
గారి కార్యాలయం, వరంగల్ జిల్లా

**పత్రికా ప్రకటన**

ఆర్. సి. నెం. ఎ /150 /2026 తేదీ : 03 -10-2026

2026-27 సంవత్సరం అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్, శిక్షణ పొందుటకు గాను వరంగల్ జిల్లాకు చెందిన బి.సి. కులమునకు చెందిన లా గ్రాడ్యుయేట్ల నుండి దరఖాస్తులు కోరబడుచున్నవి.

అర్హతలు:

1. ఏ ఫ్యాకల్టీలో అయినా బేసిక్ డిగ్రీ హోల్డర్ మరియు భారత దేశంలో కేంద్ర చట్టం మరియు ప్రోవిన్షియల్ చట్టం లేదా రాష్ట్ర చట్టం కింద స్థాపించబడిన లేదా చేర్చబడిన ఏ విశ్వ విద్యాలయం మరియు కేంద్ర విశ్వ విద్యాలయము గ్రాంట్స్ కమిషన్ గుర్తించిన విద్యా సంస్థల నుండి లా కోర్స్ లో డిగ్రీ పొంది ఉండాలి.
2. వయస్సు జులై 2026 నాటికి 23 నుండి 35 సంవత్సరములు లోబడి ఉండవలెను.
3. అభ్యర్థి తల్లిదండ్రుల / సంరక్షకుని ఆదాయం గ్రామీణ ప్రాంతము వారికి రూ. 1,50,000/- , పట్టణ ప్రాంతము వారికి రూ. 2,00,000/- కు మించరాదు.
4. అభ్యర్థి గతములో ఇటువంటి సౌకర్యము వినియోగించుకొని ఉండరాదు.

ఎంపికైన అభ్యర్థులు మూడు సంవత్సరాలు అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ శిక్షణ పొందాలి. ఈ మూడు సంవత్సరాలకు ఆర్థిక సహాయం కల్పించబడును.

1. శిక్షణ పొందు కాలములో మాసమునకు రూ. 1000/- ల చొప్పున స్టైపండ్ చెల్లించబడును.
2. అడ్వకేట్ గా ఎన్ రోల్ మెంట్ ఫీజ్ రూ. 585/-
3. లా పుస్తకములు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ. 3000/-
4. ఎంపిక చేయబడు అభ్యర్థుల సంఖ్య : (4)

ఎంపిక చేయబడిన అభ్యర్థులు శిక్షణ కొరకు జిల్లా న్యాయస్థానములోని ప్రభుత్వ న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కు అనుబంధం చేయబడును. అభ్యర్థులు నిర్ణీత ప్రొఫార్మాలో దరఖాస్తు చేయవలెను, ఈ దరఖాస్తులు జిల్లా బి. సి. అభివృద్ధి అధికారి, వరంగల్ గారి కార్యాలయములో **తేదీ. 05-10-2026** నుండి పొందవచ్చును. పూర్తి చేసిన దరఖాస్తులతో పాటు అభ్యర్థి పాస్ పోర్ట్ ఫోటో, ఆధార్ కార్డు జిరాక్స్, స్థానిక, కుల, ఆదాయ ధృవీకరణ పత్రములు మరియు లా డిగ్రీ మరియు డిగ్రీ యొక్క ప్రొవిజనల్, కన్సాలిడేట్ ధృవీకరణ పత్రాలను **తేదీ. 20-10-2026** లోగా జిల్లా బి. సి. అభివృద్ధి అధికారి, వరంగల్ గారి కార్యాలయమునందు అందజేయవలసిందిగా ఎ.పుష్పలత, ఉప సంచాలకులు, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ, వరంగల్ గారు విజ్ఞప్తి చేయుచున్నారు.

ఉప సంచాలకులు, 3/X/26
వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ,
వరంగల్ జిల్లా.

**వరంగల్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

2026–27 సంవత్సరానికి బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లా గ్రాడ్యుయేట్లకు న్యాయవాద వృత్తిలో శిక్షణ అందించేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వరంగల్ జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయం ప్రకటించింది. వరంగల్ జిల్లాకు చెందిన బీసీ కులాల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. అభ్యర్థి లా డిగ్రీ పూర్తి చేసి ఉండడంతో పాటు సంబంధిత బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకుని ఉండాలని, 2026 జూలై నాటికి 23 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థి కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలకు మించకూడదని, గతంలో ఇలాంటి ప్రభుత్వ పథకం ద్వారా శిక్షణ పొందిన వారు అర్హులు కాదని స్పష్టం చేశారు. ఎంపికైన అభ్యర్థులకు మూడు సంవత్సరాల పాటు అడ్వకేట్ శిక్షణతో పాటు ఆర్థిక సహాయం అందించనున్నారు. మొదటి సంవత్సరంలో శిక్షణ పొందే అభ్యర్థికి నెలకు రూ.1,000 స్టైఫండ్‌తో పాటు అడ్వకేట్ బార్ రోల్ మెయింటెనెన్స్ ఫీజు కింద రూ.585, లా పుస్తకాలు, ప్రింటర్ తదితర అవసరాలకు రూ.3,000 చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నారు. మొత్తం నాలుగు మంది అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన అభ్యర్థులు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, లా డిగ్రీ, ఇతర విద్యార్హతల ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణ 2026 అక్టోబర్ 5 నుంచి ప్రారంభమై, అక్టోబర్ 20లోగా జిల్లా బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయం, వరంగల్‌లో సమర్పించాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన బీసీ లా గ్రాడ్యుయేట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

# ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై తప్పుడు ప్రచారం తగదు

**ఎన్‌టీవీ ప్రసారంపై తీవ్రంగా స్పందించిన 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్**

**హన్మకొండ, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**



వర్ధన్నపేట నియోజకవర్గ శాసనసభ్యుడు కేఆర్ నాగరాజుపై ఎన్‌టీవీ ఛానల్‌లో ప్రసారమైన వార్తను తీవ్రంగా ఖండిస్తున్నట్లు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 65వ డివిజన్ అధ్యక్షుడు నేదునూరి సునీల్ తెలిపారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు రాజకీయంగా ఎదుగుతున్న తీరును చూసి ఓర్చుకోలేక కొన్ని ఛానళ్లు తప్పుడు ప్రచారాలకు పాల్పడుతున్నాయని ఆయన ఆరోపించారు. ఎలాంటి ఆధారాలు లేకుండా, వాస్తవాలను పూర్తిస్థాయిలో నిర్ధారించుకోకుండా ఒక ప్రజాప్రతినిధి వ్యక్తిత్వం, ప్రతిష్టకు భంగం కలిగించే విధంగా వార్తలు ప్రసారం చేయడం బాధ్యతారాహిత్యమైన చర్య అని అన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటూ, వర్ధన్నపేట నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కృషి చేస్తున్నారని సునీల్ పేర్కొన్నారు. ఆయనపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు విశ్వసించరని అన్నారు. వార్తలను ప్రసారం చేసే ముందు సంబంధిత అంశాలపై వాస్తవాలను నిర్ధారించుకోవడం మీడియా సంస్థల బాధ్యత అని సునీల్ తెలిపారు. నిర్ధారణ కాని అంశాలను వార్తలుగా ప్రసారం చేయడం వల్ల ప్రజల్లో అనవసరమైన గందరగోళం ఏర్పడే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుపై ఎన్‌టీవీ ఛానల్‌లో ప్రసారమైన వార్తను వెంటనే ఉపసంహరించుకోవాలని, వాస్తవ పరిస్థితులను ప్రజలకు స్పష్టం చేయాలని, తమ తప్పిదంపై బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఎన్‌టీవీ యాజమాన్యాన్ని నేదునూరి సునీల్ డిమాండ్ చేశారు.

# అదనపు ఎస్పీకి తృటిలో తప్పిన ప్రమాదం..

**టిప్పర్ ఢీకొనడంతో కారు ముందు భాగం ధ్వంసం**

**ములుగు, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**



ములుగు జిల్లా ఏఆర్ అదనపు ఎస్పీ సదానందం ప్రయాణిస్తున్న కారును టిప్పర్ ఢీకొట్టిన ఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి అదనపు ఎస్పీ కారు బయటకు వస్తున్న సమయంలో బండారుపల్లి వైపు నుంచి ములుగు వైపు వెళ్తున్న టిప్పర్ వేగంగా వచ్చి కారును ఢీకొట్టినట్లు సమాచారం. టిప్పర్ ఢీకొనడంతో అదనపు ఎస్పీ ప్రయాణిస్తున్న కారు ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది. అయితే కారులో ఉన్న అదనపు ఎస్పీ సదానందంతో పాటు డ్రైవర్, సిబ్బందికి ఎలాంటి గాయాలు కాలేదని తెలిసింది. దీంతో అధికారులు, సిబ్బంది ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల కారణాలు, టిప్పర్ వేగం తదితర అంశాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# బన్నీ-అట్లీ సినిమా పుకార్లకు చెక్ పెట్టిన ఐశ్వర్య లక్ష్మి

స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్, తమిళ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న పాన్–ఇండియా చిత్రం ‘రాకా’పై సినీ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో సినిమా క్యాస్టింగ్‌కు సంబంధించి వస్తున్న ఊహాగానాలకు నటి ఐశ్వర్య లక్ష్మి తెరదించారు. ఈ చిత్రంలో తాను నటిస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. గత కొన్ని రోజులుగా ‘రాకా’ చిత్రంలో ఐశ్వర్య లక్ష్మి ఒక కీలక పాత్రలో, ముఖ్యంగా నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలో కనిపించబోతున్నారంటూ ప్రచారం జోరుగా సాగింది. ఈ పుకార్లపై తాజాగా ఓ ఇంటర్వ్యూలో స్పందించిన ఆమె, “నేను ఆ సినిమాలో భాగం కాదు. దయచేసి ఎవరైనా నన్ను ఆ సినిమాలో తీసుకోండి” అంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఆమె వివరణతో ఈ ప్రచారానికి ఫుల్‌స్టాప్ పడినట్లయింది. అల్లు అర్జున్–అట్లీ కాంబోలో వస్తున్న తొలి సినిమా కావడంతో ‘రాకా’పై సర్వత్రా ఆసక్తి నెలకొంది. సన్ పిక్చర్స్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఇందులో దీపికా పదుకొణె నటిస్తున్నట్లు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. వీరితో పాటు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రష్మిక మందన్న వంటి తారల పేర్లు కూడా పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఐశ్వర్య లక్ష్మి, అర్జున్ దాస్‌తో కలిసి నటించిన రొమాంటిక్ కామెడీ సిరీస్ ‘లవ్’లో నటిస్తున్నారు. ‘పొన్నియిన్ సెల్వన్’ వంటి చిత్రాలతో ఈమె చాలా గుర్తింపు పొందారు.

# క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

**అనుమతి లేకుండా నిర్వహించే ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై చట్టపరమైన చర్యలు**

**వరంగల్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ నిబంధనలను జిల్లాలోని అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ సెంటర్లు తప్పనిసరిగా పాటించాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. అనుమతులు, రిజిస్ట్రేషన్ లేకుండా క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ నిర్వహిస్తే నోటీసులు జారీ చేసి, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్‌కు సంబంధించిన జిల్లా రిజిస్ట్రేషన్ అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి. రాజా రెడ్డి జిల్లాలో చట్టం అమలు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రిజిస్ట్రేషన్లు, రెన్యువల్స్, పర్యవేక్షణకు సంబంధించిన నివేదికను కమిటీ సభ్యులకు సమర్పించారు. జిల్లాలోని వివిధ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ కొత్త రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ రెన్యువల్ కోసం సమర్పించిన దరఖాస్తులను కమిటీ పరిశీలించింది. నిబంధనలను పూర్తిస్థాయిలో పాటిస్తున్న సంస్థలకు రిజిస్ట్రేషన్, రెన్యువల్ అనుమతులు మంజూరు చేశారు. ఫైర్ సేఫ్టీ తదితర నిబంధనల్లో లోపాలు ఉన్న సంస్థలకు వాటిని సరిదిద్దుకునేందుకు అవసరమైన అవకాశం కల్పించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని అన్ని క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్న ఆసుపత్రులు, డయాగ్నస్టిక్ కేంద్రాలపై నోటీసులు జారీ చేయడంతో పాటు చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆసుపత్రులు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్‌లో అందిస్తున్న వైద్య సేవలు, వైద్యుల వివరాలు, సిబ్బంది వివరాలు, రిజిస్ట్రేషన్ వివరాలు తదితర సమాచారాన్ని రోగులకు స్పష్టంగా కనిపించేలా రిసెప్షన్ కౌంటర్‌తో పాటు ప్రాంగణంలోని ప్రముఖ ప్రదేశాల్లో ప్రదర్శించాలని సూచించారు. అలాగే ప్రభుత్వం, చట్టం ద్వారా నిర్దేశించిన నిబంధనల ప్రకారం మాత్రమే వైద్య సేవలు, ల్యాబొరేటరీ, డయాగ్నస్టిక్ సేవలకు సంబంధించిన ఫీజులను వసూలు చేయాలని అధికారులు స్పష్టం చేశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ యాక్ట్ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే సంస్థలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రిజిస్ట్రేషన్, రెన్యువల్‌తో పాటు ఫైర్ సేఫ్టీ, బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రికార్డుల నిర్వహణ తదితర నిబంధనలను కూడా అన్ని ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్స్, డయాగ్నస్టిక్ సెంటర్లు తప్పనిసరిగా పాటించాలని అధికారులు సూచించారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ వై.వి. గణేష్, డీసీపీ కవిత, డీఎంహెచ్ఓ డాక్టర్ బి. రాజా రెడ్డి, ఐఎంఏ నుంచి డాక్టర్ వెంకటస్వామి, డిప్యూటీ డీఎంహెచ్ఓ రాజమౌళి, జిల్లా, జీడబ్ల్యూఎంసీ ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయ స్టాటిస్టికల్ ఆఫీసర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.




# అధిక లోడుతో యథేచ్ఛగా గ్రానైట్ లారీల రాకపోకలు

**సైదాపూర్, ఘనపూర్, ఆకునూర్, జాగిరిపల్లి గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు**
**గుంతలమయంగా మారుతున్న రహదారులు..**
**ప్రమాదాల భయంతో గ్రామస్తులు**
**అధిక లోడుపై అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని డిమాండ్**
**గ్రానైట్ లారీలను అడ్డుకుంటున్న స్థానికులు**
**నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి**

**సైదాపూర్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్):**

కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రం పరిసర ప్రాంతాల్లోని గ్రానైట్ క్వారీల నుంచి భారీగా గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న లారీల రాకపోకలు స్థానికులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. అధిక లోడుతో భారీ గ్రానైట్ రాళ్లను తరలిస్తున్న లారీలు నిబంధనలను పట్టించుకోకుండా గ్రామీణ రహదారులపై రాకపోకలు సాగిస్తున్నాయంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సైదాపూర్, ఘనపూర్, ఆకునూర్, జాగిరిపల్లి, వాటి పరిసర గ్రామాల మీదుగా పగలు, రాత్రి వేళల్లో భారీ లారీలు తిరుగుతున్నాయని, ముఖ్యంగా అర్ధరాత్రి సమయాల్లో కూడా అధిక లోడుతో గ్రానైట్ రవాణా కొనసాగుతోందని స్థానికులు చెబుతున్నారు. భారీ రాళ్లతో వెళ్తున్న లారీల కారణంగా ఇప్పటికే గ్రామీణ రహదారులు పలుచోట్ల గుంతలమయంగా మారాయని, వర్షాలు కురిసిన సమయంలో పరిస్థితి మరింత అధ్వానంగా మారుతోందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారులపై ఏర్పడిన గుంతల కారణంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, పాఠశాల వాహనాలు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. మరోవైపు భారీ లోడుతో వెళ్తున్న లారీలు వేగంగా ప్రయాణించడంతో ఎదురుగా వచ్చే వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారని, రాత్రి వేళల్లో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల మధ్య నుంచి భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నారు. సమస్య తీవ్రతపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్థానికులు పలుమార్లు రహదారిపైకి వచ్చి గ్రానైట్ లారీలను అడ్డుకున్నట్లు తెలిపారు. అధిక లోడుతో వస్తున్న వాహనాలను అధికారులు తనిఖీ చేసి, నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. గ్రానైట్ క్వారీ నిర్వాహకులకు భారీగా ఆదాయం వస్తున్నప్పటికీ, వారి వాహనాల రాకపోకలతో దెబ్బతింటున్న గ్రామీణ రహదారుల మరమ్మతులపై మాత్రం తగిన చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నా పట్టించుకోకుండా భారీ వాహనాల రాకపోకలు కొనసాగించడం వల్ల ప్రజలకు ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని వారు పేర్కొంటున్నారు. గ్రానైట్ లారీల బరువు పరిమితి, వాహనాల అనుమతులు, రవాణా మార్గాలు, వాహనాల భద్రత, లోడ్ సురక్షితంగా ఉందా అనే అంశాలపై సంబంధిత అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అధిక లోడుతో రవాణా చేస్తున్న వాహనాలపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు, దెబ్బతిన్న రహదారులను వెంటనే మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అవసరమైన ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, భారీ వాహనాల వేగాన్ని నియంత్రించే చర్యలు చేపట్టాలని, రాత్రి వేళల్లో ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు కలగకుండా సైదాపూర్ మండలంలోని గ్రానైట్ లారీల రాకపోకలపై అధికారులు సమగ్రంగా పరిశీలించి కఠిన చర్యలు తీసుకోవాలని, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# దసరా నవరాత్రులకు కలెక్టర్లు, పోలీస్ కమిషనర్, ఎమ్మెల్సీకి ఆహ్వానం

**హన్మకొండ, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

దసరా నవరాత్రుల సందర్భంగా నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమాలకు హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు చౌహత్ బాజ్‌పాయ్, డా. సత్య శారద, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపీఎస్‌తో పాటు ఎమ్మెల్సీ బసవరాజ్ సారయ్యను నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా దసరా నవరాత్రులలో నిర్వహించనున్న కార్యక్రమాల వివరాలను వారికి తెలియజేశారు. ఉత్సవాలకు హాజరై కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వానం అందుకున్న అధికారులు, ఎమ్మెల్సీ నవరాత్రి ఉత్సవాల నిర్వహణకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తిశ్రద్ధలతో దసరా నవరాత్రులను ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.







# ఏఐ ఆధారిత సిలబస్‌తో కాకతీయ విశ్వవిద్యాలయంలో సమూల మార్పులు

**ఉత్తర తెలంగాణ విద్యాసంస్థలకు నోడల్ కేంద్రంగా అభివృద్ధి..**
**అంతర్జాతీయీకరణ, పరిశోధన, పరిశ్రమల అనుసంధానానికి ప్రాధాన్యం: వీసీ ప్రొ. కె. ప్రతాప్ రెడ్డి**

**హైద్రాబాద్, అక్టోబర్ 3( జై భీమ్ న్యూస్)**




భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కాకతీయ విశ్వవిద్యాలయంలో ఏఐ ఆధారిత సిలబస్‌ను ప్రవేశపెట్టడంతో పాటు విద్య, పరిశోధన, సాంకేతిక రంగాల్లో సమూల మార్పులు చేపడుతున్నట్లు వైస్ ఛాన్సలర్ ప్రొ. కె. ప్రతాప్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి (టీజీసీహెచ్ఈ) ఆధ్వర్యంలో జేఎన్‌టీయూహెచ్ గోల్డెన్ జూబ్లీ హాల్‌లో శనివారం నిర్వహించిన రీచ్--2026 సదస్సులో జరిగిన ప్యానెల్ చర్చలో ఆయన మాట్లాడారు. రాబోయే ఐదేళ్లలో కాకతీయ విశ్వవిద్యాలయాన్ని ఉత్తర తెలంగాణ విద్యాసంస్థలకు నోడల్ కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. తొలిదశలో సుమారు 2,000 మంది విద్యార్థులకు ప్రయోజనం కల్పించి, భవిష్యత్తులో మరింత మందికి అవకాశాలను విస్తరించనున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే చర్యల్లో భాగంగా 30 మంది ఇంజినీరింగ్ విద్యార్థులను జర్మనీకి పంపించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు, 40 మంది పరిశోధకులు, అధ్యాపకులను అంతర్జాతీయ విద్యా, పరిశోధనా కార్యక్రమాల్లో భాగస్వాములను చేయనున్నట్లు వెల్లడించారు. ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో 68కు పైగా పరిశోధనా ప్రాజెక్టులు, 1,000కు పైగా అంతర్జాతీయ పరిశోధనా ప్రచురణలు, 100కు పైగా పేటెంట్లు ఉన్నాయని తెలిపారు. పరిశోధనలకు మరింత ఊతమిచ్చేందుకు ప్రభుత్వ, పరిశ్రమల సంస్థల సహకారంతో సుమారు రూ.50 కోట్ల పరిశోధనా నిధులను సమీకరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పరిశ్రమలు--విశ్వవిద్యాలయాల మధ్య భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, విద్యార్థులకు పరిశ్రమల అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు, శిక్షణ, ఇంటర్న్‌షిప్‌లు, ప్రాజెక్టులు, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రముఖ పరిశ్రమలు, స్టార్టప్ సంస్థలు, ఇన్నోవేషన్ ఎకోసిస్టమ్‌తో అనుసంధానాన్ని పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా సైయింట్, టి – హబ్ వంటి సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులకు పరిశ్రమలతో ప్రత్యక్ష అనుసంధానం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరిశ్రమల సహకారంతో పరిశోధన ఫలితాలను వాస్తవ ప్రపంచ సమస్యలకు పరిష్కారాలుగా మలచడంతో పాటు వాటిని సమాజానికి చేరువ చేయడమే లక్ష్యమన్నారు. గ్రామీణ, ద్వితీయ శ్రేణి ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్య, పరిశోధన, సాంకేతిక అవకాశాలను అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యమని, ఏఐ, ఆధునిక సాంకేతికత, పరిశోధన, పరిశ్రమల అనుసంధానం, అంతర్జాతీయ భాగస్వామ్యాల ద్వారా కాకతీయ విశ్వవిద్యాలయాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యా, పరిశోధనా కేంద్రంగా అభివృద్ధి చేస్తామని ప్రొ. ప్రతాప్ రెడ్డి తెలిపారు. ఈ సదస్సుకు రాష్ట్ర పరిశ్రమలు, ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా, సియంట్ వ్యవస్థాపక ఛైర్మన్ బి.వి. మోహన్ రెడ్డి గౌరవ అతిథిగా హాజరయ్యారు. టీజీసీహెచ్ఈ ఛైర్మన్ ప్రొ. వి. బాలకిష్టా రెడ్డి, వైస్ ఛైర్మన్ ప్రొ. ఇ. పురుషోత్తం, కార్యదర్శి ప్రొ. శ్రీరామ్ వెంకటేష్‌తో పాటు కాకతీయ విశ్వవిద్యాలయం అధికారులు, వివిధ విశ్వవిద్యాలయాల ఉపకులపతులు, అధ్యాపకులు, పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కెయూ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల ఉపాధి నైపుణ్యాల శిక్షణ



**వరంగల్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని కాకతీయ విశ్వవిద్యాలయ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఆధ్వర్యంలో, తెలంగాణ నైపుణ్య, జ్ఞాన అకాడమీ సహకారంతో వారం రోజుల పాటు 'మహీంద్రా ప్రైడ్ తరగతి గది ఉపాధి నైపుణ్యాలు' అనే అంశంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 3 నుంచి 9వ తేదీ వరకు కొనసాగే ఈ శిక్షణ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు అవసరమైన వివిధ నైపుణ్యాలపై అవగాహన కల్పించనున్నారు. ముఖ్యంగా మౌఖిక సామర్థ్యం, సంభాషణ నైపుణ్యాలు, సున్నిత నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందించనున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్. రమణ మాట్లాడుతూ, ప్రస్తుత పోటీ ప్రపంచంలో కేవలం సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే ఉంటే సరిపోదని అన్నారు. విద్యార్థులు ఉద్యోగ రంగంలో విజయవంతంగా రాణించాలంటే సాంకేతిక నైపుణ్యాలతో పాటు సంభాషణ, వ్యక్తిత్వ వికాసం, సున్నిత నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం వంటి అంశాలను కూడా అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహీంద్రా ప్రైడ్ తరగతి గది వంటి శిక్షణ కార్యక్రమాలు విద్యార్థుల్లో అవసరమైన నైపుణ్యాలను పెంపొందించడంతో పాటు వారి ఆశయాలను విజయవంతమైన వృత్తి జీవితంగా మలచుకునేందుకు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఇంజనీరింగ్ విద్యార్థులకు ఇలాంటి విలువైన అవకాశాలను కల్పించేందుకు తెలంగాణ నైపుణ్య, జ్ఞాన అకాడమీతో కలిసి పనిచేస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. ప్రముఖ మౌఖిక సామర్థ్యం, సున్నిత నైపుణ్యాల శిక్షకుడు థామస్ గొగులమూడి ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ఆధునిక ఉద్యోగ వాతావరణంలో విజయవంతంగా రాణించేందుకు అవసరమైన వివిధ అంశాలను ఈ శిక్షణలో బోధించనున్నారు. ఈ కార్యక్రమానికి ఆర్. లక్ష్మణ్ నాయక్, డాక్టర్ పి. సంతోష్ కుమార్ సమన్వయకర్తలుగా వ్యవహరిస్తున్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, భవిష్యత్‌లో మెరుగైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునేందుకు సిద్ధం కావాలని నిర్వాహకులు కోరారు.

# సహకార సంఘాల బలోపేతానికి మౌలిక వసతులు





**రామచంద్రపురంలో 250 మెట్రిక్ టన్నుల గోదాం ప్రారంభం**

**తీగరాజుపల్లిలో రూ.30 లక్షలతో ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి శంకుస్థాపన**

**సహకార సంఘాల సేవలను సభ్యులు సద్వినియోగం చేసుకోవాలి: ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి**

**సంగెం, అక్టోబర్ 3( జై భీమ్ న్యూస్)**

సంగెం మండలంలో సహకార సంఘాలు, మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులను మరింత బలోపేతం చేసే దిశగా శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రపురం గ్రామంలో ఎఫ్ఎస్‌సీఎస్ కాపులకనపర్తి సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంను పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ సొసైటీ పాలక మండలి సభ్యులు సమర్థవంతంగా పనిచేస్తున్నారని అభినందించారు. సహకార సంఘాల ద్వారా సభ్యులకు అందుబాటులో ఉన్న వివిధ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సహకార సంఘాల ద్వారా రైతులు, సభ్యుల ఆర్థిక అభివృద్ధికి మరింతగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల వ్యవసాయ ఉత్పత్తులను భద్రపరుచుకునేందుకు గోదాంలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. మహిళలకు ఉపాధి, అదనపు ఆదాయ అవకాశాలు కల్పించే ఉద్దేశంతో పాల ఉత్పత్తి, పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. మహిళలు, సొసైటీ సభ్యులు ఈ సదుపాయాలను పూర్తిస్థాయిలో వినియోగించుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు. జిల్లాలో సహకార రంగం అభివృద్ధికి, వివిధ కార్యక్రమాల అమలుకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అందిస్తున్న సహకారం, ప్రోత్సాహాన్ని ఎమ్మెల్యే అభినందించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా రైతులు, సభ్యులకు అందుతున్న సేవలను మరింత విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. రామచంద్రపురంలో నూతనంగా నిర్మించిన 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంను రైతులు, సొసైటీ సభ్యులు సద్వినియోగం చేసుకుని తమ వ్యవసాయ ఉత్పత్తులను సురక్షితంగా నిల్వ చేసుకోవాలని సూచించారు. సహకార సంఘాల బలోపేతానికి పాలక మండలి సభ్యులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. అనంతరం సంగెం మండలం తీగరాజుపల్లి గ్రామంలో సెర్ప్, డీఆర్‌డీఏ, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో వి.బి.-జీ రామ్ జీ గ్రాంట్ ద్వారా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న ఫుడ్ గ్రెయిన్ స్టోరేజ్ గోదాం నిర్మాణానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద శంకుస్థాపన చేశారు. ఈ గోదాం నిర్మాణం పూర్తయితే మహిళా సంఘాలు, రైతులు, స్థానిక ఉత్పత్తిదారులకు తమ ధాన్యం, ఇతర ఆహార ధాన్యాలను భద్రపరుచుకునేందుకు మరింత సౌకర్యం కలగనుంది. గ్రామీణ ప్రాంతాల్లో సహకార సంఘాలు, మహిళా సంఘాలకు అవసరమైన మౌలిక వసతులను కల్పించడం ద్వారా రైతులు, మహిళలకు ఆర్థికంగా మరిన్ని అవకాశాలు అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, పాల ఉత్పత్తి, పాల సేకరణ వంటి కార్యకలాపాలను ప్రోత్సహించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా సహకార అధికారి నీరజ, జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ భాస్కర్, సంగెం తహసీల్దార్ రాజకుమార్, మండల అభివృద్ధి అధికారి రమేష్, సెర్ప్, డీఆర్‌డీఏ అధికారులు, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, సొసైటీ పాలక మండలి సభ్యులు, సిబ్బంది, రైతులు, సొసైటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## నాణ్యతతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

**గుడిసెల్లో నివసిస్తున్న అర్హులకు ప్రాధాన్యత ఇవ్వాలి: గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఐఏఎస్**



**ములుగు, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ, మిగిలిన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి లబ్ధిదారులకు ఇళ్లను అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యదర్శి వి.పి. గౌతమ్ ఐఏఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన గోవిందరావుపేట మండలం బుస్సాపూర్, తాడ్వాయి మండలం మేడారం, వెంకటాపూర్ మండలం పాలంపేట గ్రామపంచాయతీల పరిధిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వివిధ దశల్లో కొనసాగుతున్న నిర్మాణ పనులను పరిశీలించి, వాటి పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లబ్ధిదారులతో నేరుగా మాట్లాడిన ఆయన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయం సకాలంలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతోందా అని ఆరా తీశారు. ఆర్థిక సాయం సకాలంలో అందుతోందని, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నిర్మాణ పనులు పారదర్శకంగా కొనసాగుతున్నాయని లబ్ధిదారులు తెలిపారు. ఈ సందర్భంగా వి.పి. గౌతమ్ మాట్లాడుతూ రెండో విడతలో భాగంగా అర్హులైన లబ్ధిదారుల ఎంపికలో అధికారులు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని, ముఖ్యంగా గుడిసెల్లో నివసిస్తున్న అర్హులైన కుటుంబాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. బిల్లుల మంజూరు విషయంలో లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేయకుండా, అర్హత మేరకు సకాలంలో వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులు మధ్యవర్తులు, దళారులను ఆశ్రయించాల్సిన అవసరం లేదని, అర్హత ఆధారంగానే ఇళ్లు మంజూరు చేస్తామని స్పష్టం చేశారు. ఇళ్ల నిర్మాణ పనుల్లో నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, నిర్మాణంలో ఎలాంటి లోపాలకు తావులేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మిగిలిన పనులను వేగవంతం చేసి ఇళ్లను త్వరగా పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, హౌసింగ్ పీడీ కృష్ణ ప్రసాద్, స్థానిక తహసీల్దార్లు, హౌసింగ్ శాఖ ఏఈలు, ఆయా గ్రామాల సర్పంచులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అనుమతి లేకుండా స్కానింగ్ కేంద్రాల నిర్వహణపై అధికారుల దాడులు

**స్కానింగ్ యంత్రాలు స్వాధీనం.. పలువురిపై కేసులు నమోదు**

**వరంగల్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**



వరంగల్ జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న స్కానింగ్ కేంద్రాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి ఆదేశాల మేరకు నెక్కొండ, కాశీబుగ్గ ప్రాంతాల్లో పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో చేపట్టిన తనిఖీల్లో అనుమతి లేని పోర్టబుల్ స్కానింగ్ యంత్రాలను స్వాధీనం చేసుకుని, సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. నెక్కొండలోని ఉపేందర్ ఆసుపత్రిలో అనుమతి లేకుండా స్కానింగ్ కేంద్రం నిర్వహిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో కార్యక్రమ అధికారి డాక్టర్ సాజిదా ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ అధికారులు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. స్కానింగ్ కేంద్రానికి అవసరమైన నమోదు లేకపోవడంతో పాటు సంబంధిత అర్హతలు లేని డాక్టర్ పార్థు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు గుర్తించిన అధికారులు స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకుని స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. స్కానింగ్ యంత్రాన్ని అద్దెకు ఇస్తున్నట్లు గుర్తించిన గణేష్, లింగ నిర్ధారణ కోసం గర్భిణులను తీసుకువస్తున్నట్లు గుర్తించిన పద్మను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న స్కానింగ్ యంత్రం, సెల్‌ఫోన్లు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదే విధంగా కాశీబుగ్గలోని వివేకానంద కాలనీలో అనుమతి లేకుండా గర్భిణులకు స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తూ లింగ నిర్ధారణ చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో కార్యక్రమ అధికారి సయ్యద్ ఇక్తిదార్ అహ్మద్, వైద్య సిబ్బంది, ఇంతేజార్‌గంజ్ పోలీసులు, రెవెన్యూ అధికారుల సహకారంతో తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో నమోదు లేని ఒక పోర్టబుల్ స్కానింగ్ యంత్రాన్ని గుర్తించారు. చిర్ర మాధవి అనే సిబ్బంది నర్సు సంబంధిత అర్హతలు లేకుండానే తన నివాసంలో సమీప బంధువు నిరోషతో కలిసి స్కానింగ్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. లింగ నిర్ధారణ పరీక్షల కోసం గర్భిణులను తీసుకువస్తున్నట్లు గుర్తించిన నిరోష, గణేష్‌పై కూడా కేసులు నమోదు చేశారు. స్కానింగ్ యంత్రాన్ని దిలీప్ అనే వ్యక్తి విక్రయించినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల సందర్భంగా లింగ నిర్ధారణ పరీక్షల అనంతరం ఆడ శిశువు అని తేలిన గర్భిణులను గర్భస్రావం కోసం మహబూబాబాద్‌కు చెందిన మహేందర్ అనే ఆర్‌ఎంపీ వద్దకు, అలాగే నెక్కొండకు చెందిన డాక్టర్ అంజన్ కుమార్ వద్దకు పంపుతున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈ వ్యవహారాలకు సంబంధించి గర్భస్థ పూర్వ మరియు గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నిషేధ చట్టం--1994 నిబంధనల ప్రకారం సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేశారు. కేసులపై పోలీసులు తదుపరి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. జిల్లాలో అనుమతి లేకుండా స్కానింగ్ కేంద్రాలను నిర్వహించడం, లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం లేదా అలాంటి కార్యకలాపాలకు సహకరించడం చట్టవిరుద్ధమని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి. రాజారెడ్డి తెలిపారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలను అరికట్టేందుకు వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, రెవెన్యూ శాఖల సమన్వయంతో నిరంతరం ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## వయోవృద్ధులు గతాన్ని తలచుకుని బాధపడకుండా వర్తమానాన్ని ఆనందంగా గడపాలి

**తమ విలువైన అనుభవాలను భావితరాలకు అందించాలి: జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ**




**హన్మకొండ, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

వయోవృద్ధులు గతాన్ని తలచుకుని బాధపడకుండా, ఎలాంటి ఉద్రేకాలకు లోనుకాకుండా ప్రశాంతంగా వర్తమానాన్ని ఆనందంగా గడపాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ సూచించారు. కుటుంబంలో, సమాజంలో ఓర్పుతో సర్దుబాటు చేసుకుంటూ తమ జీవితంలో సంపాదించిన విలువైన అనుభవాలను భావితరాలకు అందించాలని కోరారు. అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా సంక్షేమ శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన, విలువలతో కూడిన సమాజ నిర్మాణంలో వయోవృద్ధుల అనుభవాలు ఎంతో కీలకమని అన్నారు. వయోవృద్ధులు తమ అనుభవాలను పిల్లలతో పంచుకోవడం వల్ల వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, భయం లేకుండా వేదికలపై మాట్లాడే సామర్థ్యం, ఆసక్తి పెరుగుతాయని తెలిపారు. వయోవృద్ధులు కృంగిపోకుండా ప్రశాంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని, గతాన్ని గుర్తుచేసుకుని బాధపడకుండా ప్రస్తుత జీవితాన్ని సంతోషంగా ఆస్వాదించాలని సూచించారు. వయోవృద్ధులను గౌరవిస్తూ వారి హక్కులను కాపాడి, వారికి ప్రేమపూర్వక రక్షణ కల్పిస్తామని కార్యక్రమంలో పాల్గొన్న వారితో కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం పలువురు వయోవృద్ధులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి వయోవృద్ధుల చట్టం, ట్రిబ్యునల్ కోర్టు విధివిధానాలపై అవగాహన కల్పించారు. వయోవృద్ధులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా ట్రిబ్యునల్ కోర్టును సంప్రదించాలని, అవసరమైన సందర్భాల్లో తనను 9177362072 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) శేషాద్రి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పీడీ డీఆర్డీఏ శ్రీనివాస్, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి, డీడబ్ల్యూఓ విశ్వజ, జిల్లా వయోవృద్ధుల కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి, నర్సయ్య, ప్రవీణ్, వివిధ సంస్థల సభ్యులు రవికిరణ్, సింధు, కళ్యాణి, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, జిల్లా సంక్షేమ శాఖ సిబ్బంది, వయోవృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో అధ్యాపక ఖాళీలను భర్తీ చేయాలి

**మూడు నెలలుగా ఖాళీగా ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టు.. లెక్చరర్లు లేక కన్స్ట్రక్షన్ టెక్నాలజీ కోర్సు ఎత్తివేత**

**డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్**



**హన్మకొండ, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

హన్మకొండ పట్టణంలోని ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ (డీఎస్ఏ) రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఎస్ఏ ఆధ్వర్యంలో హన్మకొండ జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈఓ) కార్యాలయంలో ఖాళీ కుర్చీకి వినతిపత్రం అందజేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కామగోని శ్రావణ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో గత మూడు నెలలుగా ఇంగ్లీష్ లెక్చరర్ పోస్టు ఖాళీగా ఉన్నప్పటికీ భర్తీ చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. దాదాపు సగానికిపైగా కోర్సులకు ఒక్కరే లెక్చరర్ ఉండటం సిగ్గుచేటని, దీనివల్ల విద్యార్థుల విద్యాభ్యాసానికి తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని అన్నారు. లెక్చరర్లు లేకపోవడంతో కన్స్ట్రక్షన్ టెక్నాలజీ కోర్సును ఎత్తివేయడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు డీఐఈఓ కార్యాలయానికి వస్తే అక్కడ డీఐఈఓ అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. కళాశాలలో నెలకొన్న సమస్యలను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారని పేర్కొన్నారు. ఇదే సమయంలో డీఎస్ఏ జిల్లా కన్వీనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాలలోనే డీఐఈఓ కార్యాలయం కొనసాగుతుండటంతో కళాశాల విద్యా కార్యకలాపాలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, డీఐఈఓ కార్యాలయాన్ని కళాశాల నుంచి వేరే ప్రాంతానికి తరలించాలని డిమాండ్ చేశారు. కళాశాలలో ఖాళీగా ఉన్న అన్ని అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యలను తక్షణమే పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని డీఎస్ఏ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ జిల్లా నాయకులు కమల్‌రెడ్డి, వెంకటేష్, గోవర్ధన్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

**నిర్మాణం పూర్తయ్యే నాటికి వైద్యులు, సిబ్బంది, అత్యాధునిక పరికరాలు సిద్ధంగా ఉండాలి: సీఎం రేవంత్ రెడ్డి**

**హైద్రాబాద్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల పనులను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా ఆసుపత్రి, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని సూచించారు. ఆసుపత్రుల నిర్మాణం పూర్తయ్యే నాటికి వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర సిబ్బంది కొరత లేకుండా అవసరాలను ముందుగానే గుర్తించి నియామక ప్రక్రియను ప్రారంభించాలని ఆదేశించారు. అలాగే అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను ముందుగానే కొనుగోలు చేసి, ఆసుపత్రులు ప్రారంభమయ్యే సమయానికి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో సీఎంవో అధికారులతో నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలో విద్య, వైద్య రంగాలకు సంబంధించిన క్షేత్రస్థాయి పరిస్థితులు, నిర్మాణంలో ఉన్న ప్రధాన ఆసుపత్రుల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్షించారు. జిల్లా కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించేలా చూడాలని, కలెక్టర్లతో పాటు సంబంధిత అధికారులు ప్రభుత్వ పాఠశాలలు, సాంఘిక సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రులను విధిగా సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించాలని సీఎం ఆదేశించారు. జిల్లా స్థాయిలో ప్రతి వారం విద్య, వైద్య రంగాలపై సమీక్ష నిర్వహించాలని సూచించారు.



సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలల్లో అవసరమైన చోట మరమ్మతు పనులను చేపట్టాలని ఆదేశించారు. ఇదే సమావేశంలో డిసెంబరులో భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లపైనా చర్చించారు. సమ్మిట్ ఏర్పాట్లు, అతిథుల ఆహ్వానం, పెట్టుబడుల ఆకర్షణకు సంబంధించి పకడ్బందీ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. త్వరలోనే సమ్మిట్ ఏర్పాట్లను పరిశీలిస్తానని ముఖ్యమంత్రి తెలిపారు. సమావేశంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్తో పాటు సీఎంవో ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు రాష్ట్ర ప్రభుత్వ అవార్డు

**జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు**

**హన్మకొండ, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, గోపాలపురం--హనుమకొండకు అవార్డును ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నిర్వహించిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో గౌరవ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ చేతుల మీదుగా అసోసియేషన్ ప్రతినిధులు అవార్డును స్వీకరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచ వృద్ధుల దినోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం అందజేసిన మెమొంటో, ప్రశంసా పత్రాన్ని తీసుకుని అసోసియేషన్ ప్రతినిధులు జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అసోసియేషన్ అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ దామెర నర్సయ్య ఆధ్వర్యంలో ప్రతినిధుల బృందం కలెక్టర్‌ను కలిసి అవార్డు వివరాలను తెలియజేసింది. వయోవృద్ధుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ, సామాజిక భద్రత, ఆరోగ్యం తదితర అంశాల్లో అసోసియేషన్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ప్రతినిధులు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన గుర్తింపు తమకు మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో కూడా వయోవృద్ధుల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు నాగులుగా నరసయ్య, కజాంపురం దామోదర్, కార్యదర్శి తేరాల



యుగంధర్, కోశాధికారి కొండపర్తి రాజేందర్, గంటి సాంబయ్య, అనుగం జనార్ధన్, తాడూరి లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ రాజన్న, శ్రీనివాసమూర్తి, చిత్రాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందించిన అవార్డు పట్ల అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

# కిట్స్ వరంగల్‌లో కెయూ ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంట్స్

**అక్టోబర్ 5న ఘనంగా ప్రారంభం.. మూడు రోజుల పాటు క్రీడా పోటీలు**





**వరంగల్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్)**

కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కెయూ ఇంటర్-కాలేజియేట్ పురుషుల టోర్నమెంట్స్ 2026-27 (ఫేజ్-1) ఈ నెల 5వ తేదీన కిట్స్ వరంగల్ క్యాంపస్‌లోని క్రీడా మైదానాల్లో ఘనంగా ప్రారంభం కానున్నాయి. కిట్స్ వరంగల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో అక్టోబర్ 5, 6, 7 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. అశోక్ రెడ్డి తెలిపారు. టోర్నమెంట్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాకతీయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె. ప్రతాప్ రెడ్డి ముఖ్య అతిథిగా, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ ప్రొఫెసర్ టి. శాస్త్రి గౌరవ అతిథిగా హాజరుకానున్నారు. ఈ పోటీల్లో షటిల్ బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్ తదితర క్రీడల్లో క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించనున్నారు. వివిధ కళాశాలలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొననున్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి మాజీ రాజ్యసభ సభ్యులు, కిట్స్‌డబ్ల్యూ ఛైర్మన్ కెప్టెన్ వి. లక్ష్మీకాంత రావు అధ్యక్షత వహించనుండగా, కిట్స్‌డబ్ల్యూ కోశాధికారి పి. నారాయణరెడ్డి కార్యక్రమాన్ని గ్రేస్ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో కిట్స్ వరంగల్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎం. కోమల్ రెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ పి. రమేష్ రెడ్డి, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, వివిధ విభాగాల డీన్లు, విభాగాధిపతులు, కెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్, పీఆర్ఓ డాక్టర్ డి. ప్రభాకర చారి, ఫిజికల్ ఎడ్యుకేషన్ అధ్యాపకులు వెంకటస్వామి, నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొననున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న ఈ అంతర్-కాలేజియేట్ క్రీడా పోటీలు విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులకు తమ సామర్థ్యాన్ని చాటుకునే వేదికగా నిలవనున్నాయి. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, విద్యార్థులు, అధ్యాపకులు హాజరుకానున్నారు.

# ఎమ్మెల్యే నాగరాజుపై తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదు

**ఎస్టీవీ యాజమాన్యం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్**

**హనుమకొండ : (జై భీమ్ న్యూస్)**

ఎమ్మెల్యేగా ఎన్నికైన సమయం నుండి ఇప్పటివరకు వర్ధన్నపేట నియోజకవర్గాన్ని పలు రంగాలలో అభివృద్ధి పదం వైపు నడిపిస్తున్న ఎమ్మెల్యే నాగరాజుకి మంచి పేరు వస్తుందని ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఫేక్ న్యూస్ నకిలీ రాయుడులు ఖబర్దార్ అని ఐనవోలు మండల అధ్యక్షులు నకరకంటి మోహన్ గౌడ్ హెచ్చరించారు.శనివారం హనుమకొండ జిల్లా అంబేద్కర్ సెంటర్ వద్ద కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున డప్పు చప్పులతో నిరసన కార్యక్రమం ఏర్పాటు చేసి తప్పుడు కథనాలను సృష్టించి సామాజిక మాధ్యమాలలో ప్రచురించినందుకు ఎస్టీవీ యాజమాన్యం యొక్క దిష్టిబొమ్మ దహనం చేసి వెంటనే క్షమాపణ చెప్పాలి లేని పక్షంలో పెద్ద ఎత్తున ఎస్టీవీ కార్యాలయాన్ని ముట్టడించి చట్టపరమైన చర్యలు తీసుకునే విధంగా కార్యచరణ ఉంటుందని హెచ్చరించారు. ఇటీవల పారదర్శకంగా జరిగిన పిఎసిఎస్ వ్యవసాయ శాఖకు సంబంధించిన చైర్మన్ల, డైరెక్టర్ల నియమాపకాలపై తప్పుడు వార్తలను సోషల్ మీడియా మాద్యమాలలో ప్రచురించుకున్నందుకుగాను ఎస్టీవీ యాజమాన్యం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, నాయకులు జిల్లా ,నాయకులు మండల నాయకులు ప్రజాప్రతినిధులు పిఎసిఎస్ చైర్మన్లు, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు యువత నాయకులు మహిళలు పాల్గొన్నారు.





# అక్రమంగా వచ్చిందా.. సక్రమం ఎలా అయింది..!?

**సీకేఎం కళాశాల 'నియామకం'పై ప్రశ్నల వర్షం**

**మేనేజ్‌మెంట్ కోటా నుంచి రెగ్యులర్ సర్వీసు వరకు ప్రశ్నలే**

**రోస్టర్, మెరిట్, కేటగిరీ, సాంక్షన్డ్ పోస్టుపై విద్యార్థి సంఘాల ఆరా**

**డిప్యుటేషన్ పేరుతో అదే కళాశాలలో కొనసాగింపుపైనా సందేహాలు**

**విద్యార్థుల ఫిర్యాదుల నేపథ్యంలో కలెక్టర్ కమిటీ ఏర్పాటు**

**నియామకం నుంచి ప్రస్తుత సర్వీసు వరకు సమగ్ర విచారణకు డిమాండ్**




**వరంగల్, అక్టోబర్ 3 (జై భీమ్ న్యూస్):**

నగరంలోని చారిత్రక సీకేఎం డిగ్రీ, పీజీ కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా పనిచేస్తున్న పూజారి సతీష్ కుమార్ నియామకం నుంచి ప్రస్తుత సర్వీసు కొనసాగింపు వరకు పలు అంశాలపై విద్యార్థి సంఘాలు ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. మేనేజ్‌మెంట్ కోటాలో దరఖాస్తు చేసుకుని అన్‌ఎయిడెడ్ విభాగంలో అధ్యాపకుడిగా నియమితులైన వ్యక్తి సర్వీసు ఏ నిబంధనల ప్రకారం రెగ్యులరైజ్ అయింది? అనంతరం డిప్యుటేషన్ పేరుతో అదే కళాశాలలో కొనసాగడానికి ఏ ఉత్తర్వులు అనుమతించాయి? అనే అంశాలపై సమగ్ర విచారణ జరపాలని వారు డిమాండ్ చేస్తున్నారు. సతీష్ కుమార్ మేనేజ్‌మెంట్ కోటాలో దరఖాస్తు చేసుకుని సీకేఎం కళాశాలలో జంతుశాస్త్ర అధ్యాపకుడిగా నియమితులయ్యారని విద్యార్థి సంఘాలు పేర్కొంటున్నాయి. అనంతరం కళాశాల ప్రభుత్వ పరిధిలోకి వచ్చినప్పుడు ఆయన అన్‌ఎయిడెడ్ సర్వీసును ఏ విధంగా పరిగణనలోకి తీసుకున్నారు? ఎలాంటి నిబంధనల ఆధారంగా సర్వీసును రెగ్యులర్ చేశారు? అన్నది తేలాల్సి ఉందని అంటున్నారు. ముఖ్యంగా రోస్టర్ అమలు, మెరిట్, రిజర్వేషన్ కేటగిరీ, సాంక్షన్డ్ పోస్టు, బడ్జెట్ పోస్టు, ఖాళీ పోస్టు వంటి అంశాలు నియామకంలో పరిగణనలోకి తీసుకున్నారా? అనే ప్రశ్నలను లేవనెత్తుతున్నారు. తమకు అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం సంబంధిత సర్వీసు రెగ్యులరైజేషన్ జీవో నంబర్ 44 నిబంధనలకు అనుగుణంగా జరిగిందా? అనే సందేహాలు ఉన్నాయని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. అయితే జీవోలోని నిబంధనలు, సంబంధిత శాఖ ఉత్తర్వులు, సతీష్ కుమార్ సర్వీస్ రెగ్యులరైజేషన్ ఉత్తర్వులను అధికారులు పరిశీలించిన తర్వాతే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుందని పేర్కొంటున్నారు. అందువల్ల రెగ్యులరైజేషన్‌కు సంబంధించిన పూర్తి ఫైల్‌ను బహిర్గతం చేయాలని వారు కోరుతున్నారు. బదిలీ అనంతరం తిరిగి సీకేఎం కళాశాలలో కొనసాగడం, డిప్యుటేషన్ పేరుతో సేవలు అందించడం వెనుక ఉన్న పరిపాలనా ఉత్తర్వులు ఏమిటన్నదీ స్పష్టం చేయాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. డిప్యుటేషన్‌కు ఎవరు అనుమతి ఇచ్చారు? ఎంతకాలానికి అనుమతించారు? ఏ పోస్టుకు డిప్యుటేషన్ ఇచ్చారు? అదే కళాశాలలో కొనసాగించడానికి ఏ ప్రభుత్వ నిబంధన వర్తించింది? అనే అంశాలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉందని పేర్కొంటున్నారు. ఇదే సమయంలో ఎన్‌సీసీ విద్యార్థుల గ్రేడింగ్, మార్కులు, వ్యక్తిగతంగా మాట్లాడాలని ఒత్తిడి చేయడం వంటి ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. కొంతమంది విద్యార్థులు మార్కులు తగ్గిస్తామని బెదిరించినట్లు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. విద్యార్థులు, సిబ్బంది నుంచి లైంగిక వేధింపులకు సంబంధించిన ఆరోపణలు కూడా వచ్చినట్లు పత్రికా కథనాల్లో ప్రచురితమైంది. ఈ అంశంలో బాధితుల గోప్యతను కాపాడుతూ స్వతంత్ర విచారణ జరిపి వాస్తవాలను తేల్చాల్సిన అవసరం ఉందని విద్యార్థులు కోరుతున్నారు. విద్యార్థుల ఫిర్యాదుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ స్థాయిలో కమిటీ ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఆర్డీవో స్థాయి అధికారులు, ఏసీపీ స్థాయి అధికారులు, షీ టీమ్స్ కళాశాలను సందర్శించి విద్యార్థుల నుంచి వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విచారణ జరిగి ఉంటే దాని నివేదికలో ఏమి తేలింది? ఎలాంటి సిఫార్సులు చేశారు? అన్నది అధికారికంగా వెల్లడించాలని విద్యార్థులు కోరుతున్నారు. సంబంధిత అధ్యాపకుడి విధుల నిర్వహణ, తరగతులకు హాజరు, పరీక్షల విభాగంలో కొనసాగుతున్న తీరుపైనా విద్యార్థులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. కళాశాల సిబ్బందిపై ప్రభావం చూపుతున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయని వారు చెబుతున్నారు. ఈ అంశాలన్నింటినీ వ్యక్తిగత ఆరోపణలుగా కాకుండా హాజరు రిజిస్టర్లు, సర్వీస్ రికార్డులు, డిప్యుటేషన్ ఉత్తర్వులు, నియామక ఫైళ్లు, రోస్టర్ రిజిస్టర్, సాంక్షన్డ్ పోస్టుల వివరాలు, బడ్జెట్ కేటాయింపులు, ఆడిట్ రికార్డుల ఆధారంగా పరిశీలించాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నాయి. మేనేజ్‌మెంట్ కోటాలో జరిగిన నియామకం ప్రభుత్వ సర్వీసుగా ఎలా మారింది? అన్‌ఎయిడెడ్ సర్వీసును రెగ్యులర్ చేయడానికి ఏ నిబంధన వర్తించింది? రోస్టర్‌లో ఆ పోస్టు ఎక్కడ ఉంది? మెరిట్, కేటగిరీ ఎలా నిర్ణయించారు? ఆ పోస్టు సాంక్షన్డ్ పోస్టేనా? బడ్జెట్ కేటాయింపు ఉందా? ఖాళీ పోస్టు ఎలా ఏర్పడింది? డిప్యుటేషన్‌కు ఎవరు అనుమతించారు? అనే ప్రశ్నలకు అధికారులు పత్రాలతో సమాధానం ఇవ్వాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. అదేవిధంగా విద్యార్థుల ఫిర్యాదులపై ఇప్పటికే జరిగిన విచారణ వివరాలను కూడా వెల్లడించాలని కోరుతున్నారు. సీకేఎం కళాశాల వంటి చారిత్రక విద్యాసంస్థలో ఒక వ్యక్తి నియామకం లేదా కొనసాగింపుపై వివాదం ఏర్పడిన నేపథ్యంలో ఆరోపణలు--ప్రత్యారోపణలకు బదులుగా అధికారిక రికార్డుల ఆధారంగా వాస్తవాలను తేల్చాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు. కళాశాల ప్రతిష్ఠను కాపాడటంతో పాటు విద్యార్థుల భద్రత, విద్యా భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు నియామకం నుంచి ప్రస్తుత సర్వీసు వరకు ప్రతి దశను నిష్పక్షపాతంగా పరిశీలించి అధికారిక నివేదిక ద్వారా వాస్తవాలను వెల్లడించాలని వారు కోరుతున్నారు.

# సనత్‌నగర్ టిమ్స్‌లో భారీ చోరీ?

**వైద్య పరికరాల అపహరణపై వాస్తవాలు తెలుసుకునేందుకు వెళ్లనున్న బీఆర్ఎస్ నేతలకు అడ్డంకులు**
**తెల్లవారుజాము నుంచే పోలీసుల మోహరింపు.. మాగంటి సునీత గోపీనాథ్ సహా పలువురికి గృహ నిర్బంధం**



**హైదరాబాద్, 3 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

సనత్‌నగర్‌లోని టిమ్స్ ఆస్పత్రిలో లక్షల రూపాయల విలువైన వైద్య పరికరాలు అపహరణకు గురయ్యాయన్న ఆరోపణల నేపథ్యంలో వాస్తవాలను తెలుసుకునేందుకు ఆస్పత్రిని సందర్శించేందుకు ప్రయత్నించిన బీఆర్ఎస్ నేతలను పోలీసులు గృహ నిర్బంధం చేసినట్లు ఆ పార్టీ నేతలు ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మాగంటి సునీత గోపీనాథ్ నివాసం వద్ద శనివారం తెల్లవారుజామున నుంచే పోలీసులు మోహరించినట్లు బీఆర్ఎస్ వర్గాలు పేర్కొన్నాయి. ఆమె టిమ్స్ ఆస్పత్రికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. పలువురు బీఆర్ఎస్ నేతలను కూడా వారి ఇళ్ల వద్దే నిర్బంధించినట్లు ఆ పార్టీ నాయకులు ఆరోపించారు.

**వైద్య పరికరాల చోరీపై ప్రశ్నలు**

టిమ్స్‌లో విలువైన వైద్య పరికరాలు అపహరణకు గురయ్యాయన్న ప్రచారం నేపథ్యంలో ఆస్పత్రిని స్వయంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించాలని బీఆర్ఎస్ నేతలు నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పరికరాల భద్రత, ఆస్పత్రి నిర్వహణ, వైద్య సేవల పరిస్థితిపై వివరాలు తెలుసుకోవాలని భావించినట్లు పేర్కొన్నారు. అయితే చోరీకి గురైన పరికరాల విలువ ఎంత? ఏ పరికరాలు మాయమయ్యాయి? ఘటనపై కేసు నమోదైందా? దర్యాప్తు ఎక్కడి వరకు వచ్చింది? అనే అంశాలపై అధికారికంగా స్పష్టత రావాల్సి ఉంది.

**"వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే నిర్బంధం"**

తమను ఆస్పత్రికి వెళ్లకుండా అడ్డుకోవడం ద్వారా ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. తమను నిర్బంధించినా టిమ్స్‌లోని వాస్తవాలను, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల ముందుకు తీసుకువస్తామని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ వైద్య సేవలు, ప్రజాధనంతో కొనుగోలు చేసిన వైద్య పరికరాల భద్రతపై వచ్చిన ఆరోపణలపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు వెల్లడించాలని వారు డిమాండ్ చేశారు. టిమ్స్‌లో వైద్య పరికరాల అపహరణకు సంబంధించిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను ప్రజల ముందుంచడంతో పాటు, ప్రజాప్రతినిధులను ఆస్పత్రి సందర్శనకు ఎందుకు అనుమతించలేదన్న అంశంపైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ నేతలు కోరుతున్నారు.

# ఆరంభంలో వెనుకంజ.. చివర్లో పతకాల పంజా!

**21 స్వర్ణాలు సహా 85 పతకాలు**
**పతకాల పట్టికలో భారత్‌కు నాలుగో స్థానం**
**చివరి రెండు రోజుల్లో 11 స్వర్ణాలు**
**హాకీ, క్రికెట్, కబడ్డీలో డబుల్ గోల్డ్**
**అథ్లెటిక్స్‌లో అత్యధికంగా 24 పతకాలు**




ఆసియా క్రీడల్లో ఆరంభంలో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన భారత్ చివరి రెండు రోజుల్లో పతకాల పంజా విసిరి 21 స్వర్ణాలు, 27 రజతాలు, 37 కాంస్యాలతో మొత్తం 85 పతకాలు సాధించి నాలుగో స్థానంలో నిలిచింది. గురువారం వరకు 10 స్వర్ణాలతో టాప్-10లో కూడా లేని భారత్.. చివరి రెండు రోజుల్లో క్రికెట్, హాకీ, ఆర్చరీ, బాక్సింగ్, రెజ్లింగ్ తదితర క్రీడల్లో వరుస విజయాలతో మరో 11 స్వర్ణాలు సాధించి టాప్-5లోకి దూసుకొచ్చింది. పురుషులు, మహిళల హాకీతో పాటు క్రికెట్, కబడ్డీలోనూ భారత్ డబుల్ స్వర్ణాలు సాధించగా, మహిళల హాకీ జట్టు 44 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. ఆర్చరీలో ఐదు స్వర్ణాలు సహా తొమ్మిది పతకాలు దక్కగా, 17 ఏళ్ల కుమ్‌కుమ్ మహిళల వ్యక్తిగత రికర్వ్‌లో స్వర్ణం సాధించి చరిత్ర సృష్టించింది. అథ్లెటిక్స్ 24 పతకాలతో అత్యధిక పతకాలు అందించగా, షూటింగ్‌లో 15, బాక్సింగ్, రెజ్లింగ్‌లో చెరో ఆరు పతకాలు లభించాయి. అయితే 2022 హాంగ్‌జౌ క్రీడల్లో సాధించిన 106 పతకాలతో పోలిస్తే ఈసారి భారత్ పతకాల సంఖ్య తగ్గింది. పతకాల పట్టికలో చైనా 169 స్వర్ణాలు సహా 341 పతకాలతో అగ్రస్థానంలో, జపాన్ 269 పతకాలతో రెండో స్థానంలో, దక్షిణ కొరియా 150 పతకాలతో మూడో స్థానంలో నిలవగా, భారత్ 85 పతకాలతో నాలుగో స్థానాన్ని దక్కించుకుంది.

# భూపాలపల్లి జిల్లాలో దారుణం

**వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భర్తను హత్య**
**ప్రియుడితో కలిసి పురుగుల మందు కలిపిన మద్యం తాగించి.. ఆత్మహత్యగా చిత్రీకరణ**
**తల్లి ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన హత్యోదంతం.. నిందితుల అరెస్ట్**



**భూపాలపల్లి, 3 అక్టోబర్ 2026 (జై భీమ్ న్యూస్)**

వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడనే కారణంతో భర్తను ప్రియుడితో కలిసి హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించిన ఘటన భూపాలపల్లి జిల్లాలో కలకలం రేపింది. మృతుడి తల్లి ఫిర్యాదుతో పోలీసులు చేపట్టిన దర్యాప్తులో అసలు విషయం వెలుగులోకి వచ్చినట్లు పోలీసులు తెలిపారు. గణపురం మండలం బుద్దారం గ్రామానికి చెందిన సుమలతను సుమారు పదేళ్ల క్రితం వివాహం చేసుకున్న గొల్లపల్లికి చెందిన పెండల సంపత్ (32) ప్లంబర్‌గా పనిచేస్తూ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి అత్తగారింట్లో నివసించేవాడు. ఈ క్రమంలో బుద్దారం గ్రామానికి చెందిన ఉమ్మల శ్రీకాంత్‌తో సుమలతకు వివాహేతర సంబంధం ఏర్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం. భర్త తమ సంబంధానికి అడ్డుగా ఉన్నాడని భావించిన సుమలత, శ్రీకాంత్‌తో కలిసి సంపత్‌ను హతమార్చేందుకు పథకం వేసినట్లు పోలీసులు తెలిపారు. ఇందుకు సహకరిస్తే రూ.లక్ష ఇస్తామని చెప్పి తరుణ్ అనే వ్యక్తిని కూడా తమ పథకంలో భాగస్వామిని చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 17న సంపత్‌ను మద్యం తాగేందుకు శ్రీకాంత్, తరుణ్ పిలిచినట్లు సమాచారం. అనంతరం గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మైదానంలో పురుగుల మందు కలిపిన మద్యం తాగించడంతో సంపత్ మృతి చెందినట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం మృతదేహాన్ని బైక్‌పై ఇంటికి తీసుకెళ్లిన నిందితులు, చుట్టూ పురుగుల మందు చల్లి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. సంపత్ ఆత్మహత్య చేసుకున్నాడని కుటుంబ సభ్యులు, గ్రామస్తులను నమ్మించే ప్రయత్నం చేసినట్లు సమాచారం. తొలుత పోలీసులు కూడా ఆత్మహత్యగా కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిర్వహించారు. అయితే తన కుమారుడిది ఆత్మహత్య కాదని, హత్య జరిగిందని సంపత్ తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు మళ్లీ ప్రారంభమైంది. అనుమానాస్పద అంశాలపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు వివరాలను సేకరించడంతో నిందితుల పాత్ర వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు. పోలీసుల దర్యాప్తుతో భయపడిన శ్రీకాంత్, సుమలత పెద్దల సమక్షంలో పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు సమాచారం. పోలీసులు వారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలను పోలీసులు దర్యాప్తులో వెల్లడించాల్సి ఉంది.

# పెళ్లిలో పెళ్లికాని ప్రసాదులు!



**పల్లెల్లో పెరుగుతున్న ఆలస్య వివాహాలు.. ఉపాధి కొరతతో 40 ఏళ్లు దాటినా సింగిల్‌గానే**
**భారత్‌లో సంతానోత్పత్తి రేటు తగ్గుముఖం.. గ్రామీణ యువత పరిస్థితిపై ఆందోళన**

**జై భీమ్ న్యూస్ ప్రత్యేక కథనం**

తెలంగాణ: ఒకప్పుడు పెళ్లి వయసు దాటితే కుటుంబ సభ్యులు ఆందోళన చెందేవారు. ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో స్థిరమైన ఉపాధి లేకపోవడం, ఆదాయ భద్రత లేకపోవడం, వలసలు, పెరుగుతున్న జీవన వ్యయం వంటి కారణాలతో యువత వివాహాలను వాయిదా వేసుకుంటున్న పరిస్థితి కనిపిస్తోంది. కొన్ని గ్రామాల్లో 35 నుంచి 40 ఏళ్లు దాటినా వివాహం కాని యువకులు గణనీయంగా ఉన్నారని క్షేత్రస్థాయి సిబ్బంది చెబుతున్నారు.

**ఉపాధి ఉంటేనే పెళ్లి?**

గ్రామీణ ప్రాంతాల్లో యువకులకు స్థిరమైన ఉద్యోగాలు లేకపోవడం వివాహాలపై ప్రభావం చూపుతోందని స్థానికంగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలు, ఇతర ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. చేతిలో స్థిరమైన ఆదాయం లేకపోతే కుటుంబాన్ని పోషించడం ఎలా అన్న ఆందోళనతో పలువురు యువకులు పెళ్లికి దూరంగా ఉంటున్నారని వారు పేర్కొంటున్నారు. కొంతమంది ఉపాధి కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వలస వెళుతుండటంతో గ్రామాల్లో వివాహాలు మరింత ఆలస్యమవుతున్నాయని చెబుతున్నారు.

**తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు**

భారత్‌లో సంతానోత్పత్తి రేటు కూడా క్రమంగా తగ్గుతోంది. ఎన్ఎఫ్‌హెచ్‌ఎస్-5 ప్రకారం 2019--21లో దేశ సగటు మొత్తం సంతానోత్పత్తి రేటు 2.0గా నమోదైంది. జనాభా స్థిరంగా ఒక తరం నుంచి మరో తరానికి భర్తీ అయ్యేందుకు సాధారణంగా సూచించే ప్రత్యామ్నాయ స్థాయి 2.1. తెలంగాణకు సంబంధించి ఎన్ఎఫ్‌హెచ్‌ఎస్-5 అధికారిక కీలక సూచికల్లో టీఎఫ్ఆర్ 1.8గా నమోదైంది. ఇక ఐక్యరాజ్యసమితి జనాభా నిధి 2025 అంచనాలో భారత్ టీఎఫ్ఆర్ 1.9గా పేర్కొంది.

దీంతో భవిష్యత్తులో వృద్ధుల జనాభా పెరగడం, పని చేసే వయసు జనాభా వాటా తగ్గడం వంటి జనాభా మార్పులపై నిపుణుల చర్చ కొనసాగుతోంది. అయితే దీనిని కేవలం 'జనాభా సంక్షోభం'గా చూడటం కంటే ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులు, కుటుంబ పరిమాణంపై వ్యక్తిగత నిర్ణయాలను కూడా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉందని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి పేర్కొంటోంది.

**టార్గెట్ల ఒత్తిడి ఎందుకు?**

గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ నియంత్రణ, పునరుత్పత్తి ఆరోగ్య సేవల విషయంలో క్షేత్రస్థాయి సిబ్బందిపై లక్ష్యాల ఒత్తిడి ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది వాస్తవ పరిస్థితులకు అనుగుణంగా పనిచేసేలా వ్యవస్థ ఉండాలని కోరుతున్నారు. కుటుంబ నియంత్రణ కార్యక్రమాలు గతంలో లక్ష్యాధారిత విధానాలతో సాగినప్పటికీ, ప్రస్తుతం హక్కులు, గౌరవం, వ్యక్తిగత ఎంపికకు ప్రాధాన్యమిచ్చే విధానాల వైపు మారాల్సిన అవసరాన్ని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి తన తాజా నివేదికల్లో స్పష్టం చేసింది.

**"పైన టార్గెట్లు.. క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరు"**

గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసే సిబ్బంది చెబుతున్న పరిస్థితి మరో ప్రశ్నను లేవనెత్తుతోంది. వివాహం కాని యువత పెద్ద సంఖ్యలో ఉన్న గ్రామాల్లో సంతానోత్పత్తి లేదా కుటుంబ నియంత్రణకు సంబంధించిన లక్ష్యాలను కేవలం సంఖ్యల ఆధారంగా నిర్దేశిస్తే క్షేత్రస్థాయిలో వాటిని ఎలా సాధిస్తారన్నది ప్రశ్నగా మారుతోంది. ఉపాధి లేక పెళ్లి కాని యువత.. పెళ్లి ఆలస్యమవుతున్న కుటుంబాలు.. తగ్గుతున్న సంతానోత్పత్తి రేటు.. మరోవైపు క్షేత్రస్థాయి సిబ్బందిపై లక్ష్యాల ఒత్తిడి-ఈ నాలుగు అంశాలను విడివిడిగా కాకుండా సమగ్ర సామాజిక సమస్యగా చూడాల్సిన అవసరం ఉంది.

**జనాభా కంటే ముందు జీవన భద్రతపై దృష్టి**

భారత్ ఇప్పటికే ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా ఉంది. అదే సమయంలో సంతానోత్పత్తి రేటు తగ్గుతున్న నేపథ్యంలో భవిష్యత్తు జనాభా నిర్మాణం మారనుంది. అయితే యువతకు స్థిరమైన ఉపాధి, ఆదాయ భద్రత, అందుబాటులో గృహ వసతి, సామాజిక భద్రత వంటి అంశాలను బలోపేతం చేయకుండా వివాహాలు, సంతానోత్పత్తిపై మాత్రమే చర్చించడం సమస్యకు పూర్తి పరిష్కారం కాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పెళ్లి కావాలనుకునే యువతకు ఉపాధి లేకపోవడం, కుటుంబం ఏర్పాటు చేయాలనుకున్నా ఆర్థిక పరిస్థితులు అనుకూలించకపోవడం వంటి కారణాలు ఉంటే-దానికి సమాధానం కేవలం టార్గెట్లు కాదు. యువతకు భవిష్యత్తుపై భరోసా కల్పించే విధానాలే అసలు అవసరం.



HEAD OFFICE FLAT NO 101 2ND FLOOR SADGURU APTS BEHIND BAZAR THARANKA SEC BAD 500017,
HYDERABAD TELANGANA STATE OFFICE
PHONE NAMBER 9603437744, 7729045143,9441015254,7893948284 EMAIL : JAIBHEEMTVINDIA@GMAIL. COM, WEBSITE: WWW.JAIBHEEM,TV.COM